
# గ్లోబల్ - లోకల్ కథలు

వెల్చేరు చంద్రశేఖర్





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



కౌముది ప్రచురణలు - 105

# *గ్లోబల్ లోకల్ కథలు*

(వెల్చేరు చంద్రశేఖర్)

*(2012 01 – 2012 04)*

## *విషయసూచిక*


| ఏడాది | నెల | కథ పేరు | పేజి |
|---|---|---|---|
| 2012 | 01 | రియల్ (ఎ) స్టేట్ | 2 |
| 2012 | 02 | ఉద్యోగం | 6 |
| 2012 | 03 | కాన్వెంటు కామెడి | 10 |
| 2012 | 04 | కబ్జా | 25 |

# గ్లోబల్-లోకల్ కథలు
## - వెల్చేరు చంద్రశేఖర్



### గ్లోకల్ విలేజి అను పంచ మహా పాతక పట్నం.

*గ్లోబల్ విలేజి అంటే మొత్తం ప్రపంచాన్ని కొత్త కొత్త ఎలక్ట్రానిక్ సంచార సాధనాల ద్వారా దగ్గర చేస్తూ లేదా కలుపుతూ, ఒకదానిమీద ఒకటి లేదా ఒకరి మీద ఒకరు సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆధారపడి బతికే రోజువారీ బతుకుల్నే గ్లోబల్ విలేజర్స్ అని, వారు అలా నివసించాలని శాసించే పరిస్థితులు కల్పించబడిన ప్రతి పట్నాన్ని గ్లోబల్ విలేజ్ అని అనవచ్చు. అయితే గ్లోబల్‌గా ప్రకృతులు వికృతులు ఉన్నై, ప్రకృతుల్లో విలువైన చదువు, వికృతుల్లో అమ్మకానికి చదువు, ప్రకృతుల్లో నైతికంగా డబ్బు వికృతుల్లో "దొనెంబరీ '. ఇలా గ్లోబల్ - లోకల్ కలిసి గ్లోకల్ అవుతుంది. గ్లోబల్ వాల్యూస్‌ని లోకల్ గా ఆపాదిస్తే అది గ్లోకల్ అవుతుంది అనుకోవచ్చు. అంటే గ్లోబల్‌గా సెక్స్ అత్యవసరవస్తువు అయితే లోకల్ గా దాన్ని ఇన్‌డీసెంట్‌గా ఎలా ఏర్పాటుచేసుకోవాలి! అవసరం ఎలా తీర్చుకోవాలి. ఈ కొత్త వాల్యూ డెవలప్ అయిన చోటుని గ్లోకల్ విలేజి అనచ్చు, అదన్నమాట! అలాగే ఇంగ్లీషు గ్లోబల్‌గా ఎంత అవసరమో, లోకల్‌గా ఇంగ్లీషు స్కూలు నడిపేవాడికి తెలుస్తుంది. గ్లోబల్ గా రియల్ ఎస్టేటు ఇండస్ట్రీస్ పెరుగుదల కావాలి. కొన్ని దేశాలతో మనం పోటీపడాలి. లోకల్‌గా వాటిని విలువలు పెంచి వాటిని సాధించడానికి మనం ఏ విలువల్ని పణంగా పెడుతున్నాం అన్నది ఒక రూపాయి ప్రశ్నగా కాక, డాలరు ప్రశ్నగా మారి మన బుర్రని తింటోంది. అందుకే ఈ కథలు.*

## *రియల్(ఎ)స్టేట్*

**ఆ వీధిలో అంతమంది గుమికూడడం కొత్తేమీ** కాదు. చాలాసార్లు గుమికూడారు. అక్కడ జరిగే విషయాన్ని పరికిస్తూనే ఉన్నారు. ఒక ఇంటి తగువు చాలామందికి ముచ్చట!

అందుకే మధ్యాహ్నం టి.వి సీరియల్స్ ప్రేక్షకుల్ని సంపాదించి రేటింగ్స్ పెంచుకోగలుగుతున్నాయి.

ప్రతి ఇంటికి సమస్యలుండచ్చు తగువుల్దాకా వస్తేనే నలుగురికీ తెలిసేది.

ఈ తగువు కొట్టుకోడందాకా వచ్చింది. ఇద్దరు సమానమైన బలం కలవాళ్ళు కొట్టుకుంటే చెప్పేదేముంది!? ఇక్కడ జరిగింది అదికాదు.

అందుకే పరిస్థితి రసకందాయనంలో పడింది అన్నమాటే. వాళ్ళిద్దరి మధ్యా జనం కలుగుచేసుకోవడం లేదు. జనానికి భయం ఎక్కువ, అక్కడ జరిగింది ఎవరు రైటు ఎవరు రాంగ్ అనికాదు, జరుగుతున్న దాంట్లో ఓ అసమానత ఉంది. అది ఎవరూ ఎందుకు

గుర్తించలేదు. అది మన సమస్యకాదు. కుటుంబ సమస్య అయితే మనం కలుగచేసుకోకూడదు, అని ప్రజలకో కట్టుబాటు ఉంది. అందుకే ఆడది మొగాడ్ని కొట్టినా, మొగాడు ఆడదాన్ని కొట్టినాసరే మనం కలుగచేసుకోం. అయితే ఈ దెబ్బలాట ఎందుకు అంటే..

దాని కారణం అందరికీ తెలుసు, ఆ ఇల్లు పాతది పెద్ద ఇల్లు దానికి పెరిగిన గిరాకీ! ఓ బిల్డరు ఆ ఇంటికి కట్టిన వెల, అది అన్నదమ్ముల పిల్లల మధ్య దెబ్బలాటకి దారితీసింది

దెబ్బలు తిని రక్తాలు కారిన ఆడపిల్లలు ఇద్దరూ తమ్ముడి పిల్లలు, కొట్టిన వాళ్ళు అన్నగారి పిల్లలు.

ఈ తమ్ముడు తండ్రితో దెబ్బలాడి తనకి నచ్చిన అమ్మాయిని పెళ్ళిచేసుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు. అన్నగారు మాత్రం సాంప్రదాయంగా ఇంట్లోనే ఉండిపోయాడు. అందుకే హక్కు ప్రదర్శిస్తున్నారు పిల్లలు.

తమ్ముడు ఎక్కడికెళ్ళిపోయాడో ఏం చేసాడో ఎవరికీ తెలీదు. ఓ రోజు అతని భార్య ఆడపిల్లలు తల్లితో వచ్చి తాతగారి కాళ్ళమీద పడి తాము మీ రెండో కొడుకు పిల్లలమని తండ్రిపోయాడని అతని ఉద్యోగం అమ్మకి ఇచ్చారని అమ్మ చదువులేకపోవడం వల్ల, ఏ ఆఫీసులో అయితే తండ్రి ఉద్యోగం చేసి పదివేలు సంపాదించాడో, అదే ఆఫీసులో వెయ్యిరూపాయలకి జాయిన్ అయింది అని. దాంతో తమ జరుగుబాటు జరగడం లేదని వాపోయింది. కనీసం ఉండడానికి ఇల్లుకూడా లేదని వాపోయింది.

తాతగారు దయతల్చి ఆ పెద్ద ఇంటిలో ఓ మూలకి రెండు గదులు చూపించాడు. తమ్ముడి తాలూకా వాళ్ళు రావడం అన్నగారికి ఇష్టంలేదు. వారి కొడుకులకి ఇష్టం మాట అటుంచి కష్టంగా కూడా ఉంది. తాతగారు బతికున్నంత వరకూ కిమ్మనకుండా భరించారు. అయితే తాతగారు కాలం చేసారు. పరిస్థితి మారింది.

అన్నగారు మరదల్ని పంపేయాలని శతవిధాల ప్రయత్నాలు చేసాడు. కుదరలేదు. మరదలు దాని కూతుళ్ళు హక్కుల కోసం దెబ్బలాడేరు.

అది మింగుడు పడలేదు అన్నగారికి, వదిలిపోయాడనుకున్న తమ్ముడు రాలేదు సరికదా వాడి నీడలు భూతాల్లా వెన్నాడుతున్నాయి. కానీ పెద్దరికం వల్ల తనూ ఏం చెయ్యలేడు. వాళ్ళని వెళ్ళగొట్టే భారం పిల్లలకి అప్పచెప్పేడు.

పిల్లలు అంటే అన్నగారి కొడుకులు పినతండ్రి పిల్లలకి కల్పించగలిగినన్ని ఆటంకాలు కలిగించారు. అందులో కరెంటు కట్ లేకుండా చెయ్యడం, కుళాయి నీళ్ళు వాడనివ్వకపోవడం వగైరా వగైరా.

ఈ చేష్టలన్నింటికి కారణం ఆ ఇల్లు ఆ ఆస్థి. దానికి ఆ పట్టణంలో పెరుగుతున్న విలువ ఈ పట్టణానికి వలసదారుల బెడదపట్టుకుంది. తూర్పునుండి వచ్చినవాళ్ళు కళలని, కథకులని, పట్టుకొస్తే, పడమర నుంచి వచ్చినవాళ్ళు, ఇక్కడి సహజవనరులకు విలువ పెంచి వాటికి వ్యాపార విలువల్ని అంటగట్టి కరుకు భాషని, కటువు తత్వాన్ని అలవాటు చేసారు. పట్టణంలోని వాళ్ళని పట్టణ శివార్లకి తగలేసారు.

భూమికి, ఇళ్ళకి విలువలు పెరిగి, బంధుత్వానికి, సంస్కారానికి విలువ తగ్గిపోయింది. ఎలాగోలా వాళ్ళని ఇంట్లోంచి తగలెయ్యాలి ఇల్లు తమకి దక్కిపోవాలి.

కరెంటు కోతపడితే కొరసనాయిలు దీపాలతో కాలక్షేపం. ఆడపిల్లలు.. చేస్తున్నది అన్నలే అని తెలుసు కానీ నిస్సహాయంగా భరించారు. ఎదురించలేదు, ఆనాడే ఎదురిస్తే పరిస్థితి ఎలా ఉండేదో..

నీళ్ళు ఆపేస్తే వీధికొళాయికెళ్ళి నీళ్ళు తెచ్చుకున్నారు. ఆడవాళ్ళు కాబట్టీ ఇలాంటి పనులు చేసుకోడంలో పెద్ద చీకు చింతా లేకపోలేదు అనుకోకూడదు. చీకు ఉంది చింతా ఉంది. కానీ తాము ఆడవాళ్ళం ఒదిగి మసలుకోవాలనే లోకసాంప్రదాయాన్ని పాటించారు. నడవలోంచి నడవకూడదంటే దొడ్డిదారిని రాకాపోకా సాగించారు. హద్దులు మీరి వంటిమీద చెయ్యేస్తే బంధుత్వం ఆసరాకి

రాలేదని నిర్ఘాంతపోయారు. వావివరసాలేదా అనుకుని కుమిలిపోయారు. ఎదురు తిరిగారు. ఎందుకు ఎదురు తిరిగారు? దాయాదుల అసభ్య ప్రవర్తనకి. కానీ లోకానికి ఏం కనబడింది. ఆస్థికోసం తిరగబడ్డారని అనుకుంది.

ఆడపిల్లలు తిరగబడితే ఎందుకు తిరగబడ్డారు అవమానం సహించలేకా? ఆస్థికోసమా? అవసరం కోసమా? ఎందుకు.. అన్న ఆలోచన చాలావరకు ఎవరూ ఆలోచించలేదు.

అన్నదమ్ములడిగితే ఆస్థికోసం అంటారు. ఆ ఆడకూతుర్లని ఎవరూ అడగరు. వాళ్ళు నిజం చెప్పినా నమ్మరు.

ఈ ఆగడం ఎందుకంటే ఎవరో బిల్డరు ఆ ఇంటిని డెవలప్‌మెంటుకి అడిగాడు. ఏ విషయం తేల్చమని తొందరపెడుతున్నాడు. అందుకే ఆడది ఏ సంబంధీకురాలైతేనేమి? అది ఎవరైతేనేం చేతి వాటంతో అవమానం చెయ్యడం, తమ పనికి సానుకూల పరుస్తుందని అన్నదమ్ముల నమ్మకం.

అక్క చెల్లెళ్ళిద్దరూ ఏం చేస్తారు తిరగబడాలి, ఎందుకు తిరగబడాలి? ఉనికిని నిలబెట్టుకోడానికి తిరగబడాలి. తిరగబడాలి అన్న నిర్ణయం చాలదు. బలాబలాలు చూసుకు తిరగబడాలి. తాము తిరగబడ్డా, ఏం చేసినా, నెగ్గుకురాగలనా అని అనుమానం వాళ్ళకి రాలేదా? వాళ్ళు మొగాళ్ళు తను ఆడది వాళ్ళు చెయ్యి చేసుకుంటారని ఊహించలేదు. ఉన్మాదంలో వాళ్ళాపని చేసారు. దేనికి ఉన్మాదం? ఇల్లు కోసం అవమానం సహించలేక తిరగబడ్డాం అని వీళ్ళంటారు. ఆస్థికోసం అబద్దాలు చెపుతున్నారని వాళ్ళంటారు.

ఆస్థి విలువ పెరుగుతున్న కొద్దీ ఇంగితం తగ్గుతుందని నిరూపణం అవుతుంది.

అదే ఆ ఇంట్లో జరుగుతోంది.

ఆడపిల్లలు నిగ్రహిస్తున్న కొద్దీ అన్నదమ్ములు పేట్రేగిపోతున్నారు. ఆ రోజు జరుగుతోంది కూడా అదే

ఆ వీధిలో ఆ ఆడపిల్లల్ని అన్నదమ్ములు లైంగికంగా వేధిస్తున్నారంటే ఎవరూ నమ్మలేదు. నమ్మరు కూడా! ఆ రెండు బంధుత్వాల మీద అంత నమ్మకం. ఆస్థికోసం ఆడపిల్లలే అబద్దాలాడారా? అనుమానం ఒకటి కానీ పెరిగిన ఆస్థిధరలు, డెవలప్ మెంట్ పేరుమీద కాసుల పంట ముందు ఈ బంధుత్వాలు వావివరసలు పులుసులో ముక్కల్లాంటివి. ఉంటే సరే లేకపోయినా సరే ఎందుకంటే వీళ్ళు మాకు తోబుట్టడమేంటి? దాని కులమేంటి? మా అమ్మ కులమేంటి? ఈ సంకరంగాళ్ళందర్నీ తోబుట్టువులుగా చేసుకునే ఖర్మ మాకేంటీ? అన్నారు అన్నదమ్ములు. అదీ నిజమే సంకరగాళ్ళనేగా, పెళ్ళాం చీరవిప్పించి, రాజ్యం (దానికి మహాభారతం అని పేరెట్టింది) పద్దెనిమిది రోజులు వీధిని పడికొట్టుకున్నారు. దానికి దానికి పితామహులు, గురువులు కూడా కలబడ్డంతో తప్పులేదనే స్టాంపేసారు.

ఇంటిని బిల్డరుకిచ్చేద్దామనే అన్నదమ్ములు తమ తండ్రి వాటా పెట్టమన్న అక్కచెల్లెళ్ళ పాలిట రాక్షసులే అయ్యారు.

అందుకే ఆ రోజు రక్తాలు కారేమొహాలతో ఉన్న ఆడకూతుర్లు వీధిలోకి రాగానే అందరూ నిర్ఘాంతపోయారు. ఇది అన్యాయం అని ఎవరూ అన్లేదు. అనే సత్తా ఆ వీధిలో ఎవరికీ లేదు.

ఎవరూ అన్లేదు అనడానికి లేదు. ఆ ఎదురింట్లో ఓ పిచ్చివాడు ఉన్నాడు. పిచ్చివాడు అంటే పిచ్చివాడు కాదు. తనలోకంలో తనుంటాడు. ఈ లోకానికి కొంచెం దూరంగా ఉంటాడు. కాబట్టి ఉన్మాది అయాడు. అతనేదో వాగుతుంటాడు, ఇంటి వాళ్ళమీద సరిగా తిండిపెట్టలేదని దెబ్బలాడతాడు. పెట్టిన అన్నం కంపు వచ్చిందని వాపోతాడు. ప్రతిరోజూ దెబ్బలాటే అన్యాయం చేస్తున్నారంటూ. తిండి పెట్టి పోషిస్తున్నందుకు సంతోషించమంటారు, ఇంట్లో వాళ్ళు ఎందుకంటే అతనేపని చెయ్యడు. అతనికి ఎదురింట్లో జరిగింది తప్పనిపించింది. అక్కాచెల్లెళ్ల మొహం మీద రక్తం అసహనం తెప్పించింది.


అందుకే లేచి దూకుడుగా వాళ్ళింట్లోకి వెళ్ళి అన్నదమ్ముల్ని ఆపాడు. ఇద్దరాడపిల్లల్ని విడిపించడానికి లేదా ఓ అన్యాయాన్ని అడ్డుకోడానికి, ఓ నిజం చెప్పి నిలబడ్డానికి ఈ రోజుల్లో మనిషి ఉన్మాదమో, పిచ్చో, మందు మైకమో ఏదో అవలక్షణం ఉండాలి! అది ఈ పట్నంలో ఉన్న వాళ్ళు తక్కువ.

ఆడపిల్లల్లో అక్క తప్పించుకుంది. పారిపోయి పోలీసు స్టేషనుకి వెళ్ళింది. అక్కడ న్యాయం జరుగుతుందని ఆ అమ్మాయి నమ్మకం. అయితే పోలీసులు కూడా అంత అన్యాయమైన వాళ్ళుకారు. పోలీసులొచ్చారు. చోద్యం చూస్తున్న ప్రజల్ని దెబ్బలాడేరు. ఆడపిల్లల్ని తన్నేస్తుంటే అడ్డుకోనందుకు విసుక్కున్నారు.ఆ ఇద్దరు అన్నదమ్ముల్ని నాలుగు తగిలించి పోలీస్టేషనుకి ఈడ్చుకుపోయారు. వాళ్ళ నీతి ప్రకారం వాళ్ళకి తెలుసు బిల్డరు వచ్చి విడిపిస్తాడని! కాసులు పండుతాయని. అదే న్యాయం అన్న సదుద్దేశం వాళ్ళకి ఉంది.

●●●

# గ్లోబల్-లోకల్ కథలు

## - వెల్చేరు చంద్రశేఖర్



### *గ్లోకల్ విలేజి అను పంచ మహా పాతక పట్నం.*

*గ్లోబల్ విలేజి అంటే మొత్తం ప్రపంచాన్ని కొత్త కొత్త ఎల్కక్ట్రానిక్ సంచార సాధనాల ద్వారా దగ్గర చేస్తూ లేదా కలుపుతూ, ఒకదానిమీద ఒకటి లేదా ఒకరి మీద ఒకరు సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆధారపడి బతికే రోజువారీ బతుకుల్నే గ్లోబల్ విలేజర్స్ అని, వారు అలా నివసించాలని శాసించే పరిస్థితులు కల్పించబడిన ప్రతి పట్నాన్ని గ్లోబల్ విలేజ్ అని అనవచ్చు.*

*అయితే గ్లోబల్‌గా ప్రకృతులు వికృతులు ఉన్నై, ప్రకృతుల్లో విలువైన చదువు, వికృతుల్లో అమ్మకానికి చదువు, ప్రకృతుల్లో నైతికంగా డబ్బు వికృతుల్లో "దొనెంబరీ'. ఇలా గ్లోబల్ - లోకల్ కలిసి గ్లోకల్ అవుతుంది. గ్లోబల్ వాల్యూస్‌ని లోకల్‌గా ఆపాదిస్తే అది గ్లోకల్ అవుతుంది అనుకోవచ్చు. అంటే గ్లోబల్‌గా సెక్స్ అత్యవసరవస్తువు అయితే లోకల్‌గా దాన్ని ఇన్‌డీసెంట్‌గా ఎలా ఏర్పాటుచేసుకోవాలి! అవసరం ఎలా తీర్చుకోవాలి. ఈ కొత్త వాల్యూ డెవలప్ అయిన చోటుని గ్లోకల్ విలేజి అనచ్చు, అదన్నమాట! అలాగే ఇంగ్లీషు గ్లోబల్‌గా ఎంత అవసరమో, లోకల్‌గా ఇంగ్లీషు స్కూలు నడిపేవాడికి తెలుస్తుంది. గ్లోబల్ గా రియల్ ఎస్టేటు ఇండస్ట్రీస్ పెరుగుదల కావాలి. కొన్ని దేశాలతో మనం పోటీపడాలి. లోకల్‌గా వాటిని విలువలు పెంచి వాటిని సాధించడానికి మనం ఏ విలువల్ని పణంగా పెడుతున్నాం అన్నది ఒక రూపాయి ప్రశ్నగా కాక, డాలరు ప్రశ్నగా మారి మన బుర్రని తింటోంది. అందుకే ఈ కథలు.*

## "ఉద్యోగం"

**ఈ రోజు ఇది రెండోసారి నేను చైర్మన్ ఎదురుగా కూచోడం,** సుముఖంగా లేదు. మొహం చిటపట్లాడుతోంది. పొద్దున్న ఎందుకు పిలిపించాడో, తెలీదుగానీ, మా డిపార్టుమెంటు గురించి మాట్లాడ్డానికి అన్నట్టు అర్థం అవుతోంది. కానీ డిపార్టుమెంటులో కొంతమంది బాగా పని చెయ్యడం లేదని అన్నాడు. ఎవరు అన్నది చెప్పలేదు. ఇప్పుడు పిలిపించింది కూడా అందుకే, ఎవరేనా పని సరిగా చెయ్యలేదు అన్నదానికి కొలమానం ఏమిటి? అది చైర్మన్‌కి ఎలా తెలుస్తుంది? నాకెలా తెలుస్తుంది?

అసలు ఏదేనా తెలిసిందా? డిపార్టుమెంటులో ఉన్న ఇరవైమందిలో ఎవరు పని చెయ్యడంలేదు. వాళ్ళు ఏ పనినైనా ఎఫిషియంటుగా చేస్తున్నారా? లేదా? తెలుసుకోడం ఎలా? సరే తెలుసుకుని ఏం చెయ్యాలి?

వాడ్ని ఉద్యోగంలోంచి తీసెయ్యగలమా? ఇది ప్రైవేటు సంస్థ కాబట్టి, తీసేసే హక్కు వీళ్ళకుంది. కానీ ఉద్యోగం పోగొట్టుకున్న వాడి సంగతి వాడు దీనికి సిద్ధపడతాడా? నీ ఉద్యోగం రేపట్నుంచీ ఉండదు. అంటే ఊరుకుంటాడా?

నెలనెలా ఎంతో కొంత చేతికొస్తుంటేనే, చాలీచాలని జీవితం.

ఈ పట్నంలో ఉద్యోగం వెతుక్కుని వచ్చి ఏదో సంపాదించి జీవితాన్ని నెట్టుకొస్తున్నవాళ్ళు, ఆశలు పెంచుకుని కలలు కని, కలలని సావకాశం చేసుకోవాలని అప్పులు చేసినవాళ్ళు వీళ్ళందర్లో ఈ ఇరవై మంది ఉండి ఉంటారు.

చైర్మన్ వీళ్ళు పనియ్యడంలేదు. వీళ్ళు చేస్తున్నారు అని ఎలా నిర్ణయించాడు.

నిజంగా పని గురించి కాదు అని తెలుస్తోంది. మరి దేనిగురించి?

చైర్మన్‌కి బోల్డన్ని ఆబ్లిగేషన్స్ ఉంటాయ్, ఇన్‌కమ్ టాక్స్, పెళ్ళాం తరుపు బంధువులు, ఎవరికో ఉద్యోగం ఇవ్వాలి, వాళ్ళని వేసుకోడం కోసం ఎవరి ఉద్యోగమైనా తీసేస్తున్నాడా? అసలు ఉద్దేశం ఏమిటి?

అనంతలక్ష్మి సరిగా పనిచెయ్యటంలేదని, చూచాయగా చెప్పాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి. అనంతలక్ష్మిని పిలిచి నువ్వు సరిగా పనిచెయ్యడం లేదని చెప్పాలా? లేక ఇంకో ఉద్యోగం వెతుక్కోమని చెప్పాలా? నేనేమైనా చెపితే అనంతలక్ష్మి ఎలా రియాక్ట్ అవుతుంది. ఇవన్నీ ఆలోచించి మనసు చిరాకుపడింది. పరధ్యానంగా వెళ్ళి కార్లో కూర్చున్నా, ఎవరో ఇద్దరితో నవ్వుతూ కబుర్లు చెపుతూ బస్సు దగ్గరకి వెళ్తోంది అనంతలక్ష్మి.

అనంతలక్ష్మికి ముప్పైఅయిదేళ్ళుంటాయి. పెళ్ళైంది. ఇద్దరు పిల్లలు, మొగుడు కూడా ఏదో ప్రైవేటు సంస్థలోనే పనిచేస్తున్నాడు. ఇద్దరి జీతాలూ వెరసినా రోజువారీ జీవితంలో వెలితే!

నా మనసంతా రేపు ఈ వార్త అనంతలక్ష్మికి ఎలా చెప్పాలి. నీ పని చైర్మన్‌కి నచ్చలేదు అని చెపితే దానర్థం నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తారు అని చెప్పడమేగా అసలు ఆ వార్త ఎలా తీసుకుంటుంది? ఏడుస్తుందా? ఇప్పుడు నాకెవ్వరు ఉద్యోగం ఇస్తారు అని వాపోతుందా? ఎనిమిదేళ్ళు పనిచేసాక పనిలోంచి తీసేసారంటే? ఎవరైనా అవమానించారా, తనని పనిలో పెట్టుకుంటారా? ఎందుకు పనిలోంచి తీసేస్తున్నారు. పనిచెయ్యడం బాగా లేదంటే సరిపోతుందా? ఎన్నేనా అడగచ్చు, ఆఖరికి నే పని బాగా చేస్తానో చెయ్యనో నువ్వక్కడ చెప్పలేదా? అసలు నువ్వెవరిని పనిలోంచి తీసెయ్యడానికి అని తిరగబడచ్చు.

ఆలోచిస్తున్నకొద్దీ అనంతలక్ష్మితో ఈ విషయం చెప్పడం కష్టమైన పనే అనిపిస్తోంది. కానీ చెప్పక తప్పదు. ఈ విషయాన్ని చైర్మన్ చెప్పడు. వేసుకునేటప్పుడు మాత్రమే అతని ప్రమేయం.

ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. ఎప్పుడో తెల్లారాక నిద్రపట్టింది. పొద్దున్నే "ఒరెయ్ నాన్నా స్కూలు టైమైంది" అంది కూతురు. ఇంకోప్పుడైతే నవ్వేసేవాడిని, కానీ ఈరోజు మౌనంగా లేచి మొహం కడుక్కుని, కారుతీసి కూతుర్ని తీసుకెళ్ళి కాన్వెంటు దగ్గర దింపాను. లోపలికెళుతూ "బై" అంది వెనక్కి తిరిగి. అప్పుడు జ్ఞాపకం వచ్చింది దీని టర్మ్ ఫీజు పన్నెండువేలు కట్టాలి.

అనంతలక్ష్మికి పిల్లలున్నారు. వాళ్ళూ చదువుతు ఉండి ఉంటారు. వాళ్ళకి ఫీజులు కట్టాలి. వాటికి నెలనెలా జీతమే ఆధారం. అన్నీ లింకే, లింకు తెగుతుంది. మళ్ళీ అతుకెక్కడో అతుక్కుంటుందనే నమ్మకం ఏమిటి? ఇదొక్కటే లింకా, ఇంటి అద్దె లేదా బేంక్ ఇన్‌స్టాల్‌మెంట్సు. ఏది ఆగినా, భయమే, జీవితం చిరిగినట్టే.

రాత్రి నిద్రలేక బద్ధకంగా ఉండి మార్నింగ్ వాక్‌కి వెళ్ళలేదు. అనంతలక్ష్మిని తలుచుకుంటే కొంచెం జాలివేస్తోంది. ఇప్పుడు ఉద్యోగం ఎవరిస్తారని కాదు. అక్కడ ఎలా ప్రూవ్ చేసుకోవాలి? ఆ రోజుల్లో యంగ్‌గా ఉత్సాహంగా ఉంది. ఏదో చేయాలని నేర్చుకోవాలని తపన ఉండేది. అందుకే ఏ పని చెప్పినా చేసేసేది. ఇప్పుడు సంసారం, పిల్లలు, అవసరాలు పెరిగి శలవులు పెట్టక తప్పడం లేదు. అంతంతమాత్రం చేస్తుంటే పనిసరిగా చేయడం లేదనడం అన్యాయమేమో?

అనంతలక్ష్మి వెళ్ళిపోతే, అలాపని చేసేవాళ్ళు దొరకరు. మళ్ళీ కొత్తవాళ్ళు వాళ్ళని ట్రైన్ చెయ్యాలి, వాళ్ళు ట్రైన్ అయేవరకూ తనే ఆ పని చెయ్యాలి. ఇన్నాళ్ళూ వాళ్ళని ట్రైన్ చేసాక, ఇప్పుడు కాస్త పని గాడిలో పడింది. నా పని పెరుగుతుంది. అన్న చికాకు నాకుంది.

నెలనెలా జీతం లేకుండాపోతుంది అన్న ఆవేదన ఆమెకి ఎంతుంటుందో? ఈ జీతం చూసే మా ఆయన నన్ను పెళ్ళాడాడు. ఇప్పుడు అది లేదంటే? ఆయనేం చేస్తాడో?

అనంతలక్ష్మి మొగుడు అనంతలక్ష్మిని వదిలేస్తాడా? ఇప్పటికి మూడుద్యోగాలు మారాడా? అది దెబ్బలాట వేసుకుని ఇరుకు చెప్పులు విడిచేసినంత తేలికగా ఉద్యోగాలు మారాడు. ఏది చూసుకుని? ఆ ఆత్మస్థైర్యం ఎక్కడినుంచి వచ్చింది. భార్య ఉద్యోగం, రాబడి ఆ జీతం చూసుకుని కాదూ, ఆ బుర్ర తిరుగుడికి అలవాటు పడిన, అతను పెళ్ళానికి మాత్రం తలవంచుతాడా? వంచక ఏం చేస్తాడు? ఏం చెప్పినా వింటాడా? అనంతలక్ష్మిని వదిలేస్తాడా?

అన్నింటికీ మించి అనంతలక్ష్మి ఏం చేస్తుంది, ఈ మొగుడితో విసిగి, పిల్లలు భారమై, ఉన్న ఉద్యోగం ఉడిగి ఏదేనా అఘాయిత్యం చేస్తుందా?

ఏదేనా జరగవచ్చు. ఈ విషయాన్ని అనంతలక్ష్మితో చెప్పడం ఎలా? ఈ విషయం చెప్పిన వెంటనే ఒప్పేసుకుని బుద్ధిగా ఇంటికెళ్ళిపోదు. అది అర్థం అవుతోంది, కోపం రావచ్చు, ఏడుపురావచ్చు, అప్‌సెట్ అవచ్చు. నువ్వెవడివి నన్ను తీసెయ్యడానికి ఛైర్మన్‌తో మాట్లాడతాననవచ్చు. అప్పుడు తనేం చెయ్యాలి ఏం చేస్తే తన ఎఫిషెన్సీ తెలుస్తుంది.

ఈ విషయం చెప్పాక తనని గౌరవిస్తుందా! డిపార్టుమెంట్‌లో పరిస్థితి ఏమిటి? అందరూ అనుమానంగా చూస్తారు. ఎదిరిస్తారు. ఛైర్మన్ తనని ఇరుకున పెట్టాడు. దీన్ని ఎలా ఎదుర్కోవాలి?

అనంతలక్ష్మి ఏదేనా తప్పుచేస్తుందా? అని వెదుకుతున్నాడు. ఏడేళ్ళనుండి చేస్తున్న పని ఎక్కడా తప్పుదొరకడం కష్టం. ఆమెకి అప్పగించిన పని చాలా కేజువల్‌గా చేసుకుపోతోంది.

చాలా ఆలోచించి, రిహార్సల్ వేసుకున్నాక నీకు పనొచ్చా నువ్వు సీనియర్‌వి ఇంకే సంస్థలోనైనా బాగా రాణిస్తావు. ఇక్కడ కొంత స్టాఫుని తీసేసి ఖర్చు తగ్గిద్దామనుకుంటున్నారు. అందుకే ఈ ఏర్పాటు – నీకు మూడు నెలలు సేలరీ కాంపన్‌సేషన్ ఇస్తారు. నీకు మిగిలిన ఎర్నడ్ లీవుకి కేష్ ఇచ్చేస్తారు. నీకు తెలిసిన చోట వేకెన్సీలుంటే చెప్పు, ఛైర్మన్ రికమెండ్ చేస్తారు అని బుజ్జగించాలి. ఆమె అప్‌సెట్ అవకుండా చూడాలి. ఈ ఆలోచనలతో అయిదురోజులు గడిచింది. ఇది ఆమెకి చెప్పేవరకూ నాకు శాంతిలేదు. రేపే విషయం ఆమెకి చెప్పి, ఆమెకి చెప్పినట్లుగా ఛైర్మన్‌కి చెప్పాలి.

రేపు చెప్పాలని నిర్ణయించుకున్న తర్వాత కాస్త తేలికపడ్డ మనసుతో కార్లో కూర్చున్నా, అప్పుడే ప్యూను వచ్చి, మిమ్మల్ని ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గారు రమ్మన్నారు అన్నాడు. అనంతలక్ష్మికి చెప్పానా లేదా? అని అడుగుతాడేమో? ఏం చెప్పాలా అని ఆఫీసులో అడుగుపెట్టా.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ "రండి రండి ఈ కవరు ఛైర్మన్‌గారు మీకివ్వమన్నారు" అన్నాడు.

డిస్పాచ్ బుక్కులో సంతకం పెట్టి కవర్ తీసుకున్నాను. కవరు నా పేరు మీదే ఉంది. క్రింద హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అని ఉంది.

డిపార్టుమెంటులో అందరూ వెళ్ళిపోయారు. ఈ కవరు ఇంటికి కూడా ఎందుకు, అని డిపార్టుమెంటు కెళ్ళాను. నా రూములో కెళ్ళి సీటులో కూర్చుని కవరులో ఏ కంటెంటు ఉందో తెలుసుకుంటే రేపు ప్లాను చేసుకోవచ్చు అని కవరు విప్పాను.

కవరులో లెటరు నాకే ఎడ్రసు చేసి ఉంది. నేను చేసిన సర్వీసుకి కృతజ్ఞతలు ఉన్నై.

నా మూడు నెలల జీతం చెక్కుంది. ఇన్నాళ్ళూ ఆలోచించిందంతా కళ్ళముందు గిర్రున తిరిగింది.

ఏం చెయ్యాలి? కిం కర్తవ్యం!

ఇంతలో ఫోను మోగింది. అవతల ఛైర్మెన్ 'ఇది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల డెసిషన్. డిపార్టుమెంటులో ఎవరు సరిగా పనిచేయకపోయినా డిపార్ట్ మెంటు హెడ్‌దే బాధ్యత అంటున్నారు.' అని ఫోను పెట్టేసాడు. అందులో సారీ లేదు. అంటే నా కర్థం అయిపోయింది. ఇది అతని నిర్ణయమే అని. నేను కవరు తీసుకోగానే ఫోను వచ్చింది అంటే. ఎంత ప్రిప్లాన్డ్‌గా జరిగిందో అర్ధమయింది.

# గ్లోబల్-లోకల్ కథలు

## - వెల్చేరు చంద్రశేఖర్



### గ్లోకల్ విలేజి అను పంచ మహా పాతక పట్నం.

*గ్లోబల్ విలేజి అంటే మొత్తం ప్రపంచాన్ని కొత్త కొత్త ఎలక్ట్రానిక్ సంచార సాధనాల ద్వారా దగ్గర చేస్తూ లేదా కలుపుతూ, ఒకదానిమీద ఒకటి లేదా ఒకరి మీద ఒకరు సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆధారపడి బతికే రోజువారీ బతుకుల్నే గ్లోబల్ విలేజర్స్ అని, వారు అలా నివసించాలని శాసించే పరిస్థితులు కల్పించబడిన ప్రతి పట్నాన్ని గ్లోబల్ విలేజ్ అని అనవచ్చు.*

*అయితే గ్లోబల్‌గా ప్రకృతులు వికృతులు ఉన్నై, ప్రకృతుల్లో విలువైన చదువు, వికృతుల్లో అమ్మకానికి చదువు, ప్రకృతుల్లో నైతికంగా డబ్బు వికృతుల్లో "దొనెంబరీ'. ఇలా గ్లోబల్ - లోకల్ కలిసి గ్లోకల్ అవుతుంది. గ్లోబల్ వాల్యూస్‌ని లోకల్‌గా ఆపాదిస్తే అది గ్లోకల్ అవుతుంది అనుకోవచ్చు. అంటే గ్లోబల్‌గా సెక్స్ అత్యవసరవస్తువు అయితే లోకల్‌గా దాన్ని ఇన్‌డీసెంట్‌గా ఎలా ఏర్పాటుచేసుకోవాలి! అవసరం ఎలా తీర్చుకోవాలి. ఈ కొత్త వాల్యూ డెవలప్ అయిన చోటుని గ్లోకల్ విలేజి అనచ్చు, అదన్నమాట! అలాగే ఇంగ్లీషు గ్లోబల్‌గా ఎంత అవసరమో, లోకల్‌గా ఇంగ్లీషు స్కూలు నడిపేవాడికి తెలుస్తుంది. గ్లోబల్ గా రియల్ ఎస్టేటు ఇండస్ట్రీస్ పెరుగుదల కావాలి. కొన్ని దేశాలతో మనం పోటీపడాలి. లోకల్‌గా వాటిని విలువలు పెంచి వాటిని సాధించడానికి మనం ఏ విలువల్ని పణంగా పెడుతున్నాం అన్నది ఒక రూపాయి ప్రశ్నగా కాక, డాలరు ప్రశ్నగా మారి మన బుర్రని తింటోంది. అందుకే ఈ కథలు.*

## కాన్వెంటు కామెడి.

కెన్స్ కాన్వెంటు (Kanes)

అన్న పెద్ద బోర్డ్‌కి ఎదురుగా నిలబడింది సహజ. పెద్ద పెద్ద షెడ్లున్నాయి. షెడ్లకి పై కప్పులు చాలా ఎత్తుగా ఉన్నాయి. పట్టణానికి దూరంగా, రోడ్డుకి కిలోమీటరు లోపలకి ఉంది కాన్వెంటు. స్థలం విశాలంగా ఉంది.

షెడ్ల లోపల పిల్లలు ఏదో ఇంగ్లీషు రైము వల్లెవేస్తున్నారు. కాంపౌండులోకి వెళ్ళి స్కూలుకి దూరంగా ఉన్న చిన్న గదిలోకి వెళ్ళింది. అక్కడో పెద్దాయన కూర్చుని ఆ రోజు పేపరు చదువుకుంటున్నాడు.

లోపలికి వెళ్ళి, ఆయనకి నమస్కారం చేసింది.

"ఎవరు కావాలి? అన్నాడాయన యాసతో..

"ప్రిన్సిపల్"

"ఎందుకు?"

"కమీషనర్ గారు పంపించారు" అని చెప్పాడు.

"అట్టనా, ఒరేయ్ వోబులేసూ ప్రిన్సిపల్‌కి కబురెట్టు" అన్నాడు. వోబులేసు షెడ్లవేపు పరిగెత్తాడు.

వాడి వెనకాలే ఓ కుర్రాడు వచ్చాడు. వీడు ఓబులేసులా లేడు.

"ప్రిన్సిపాల్ట్రా కమీషనరు పంపుతానన్న కొత్త మాష్టమ్మ ఈవిడే మన కాన్వెంటుకు పనికొస్తదా? ఇంగ్లీషులో మాట్లాడగలదా? కనుక్కో" అన్నాడు.

ప్రిన్సిపల్ కుర్రాడు తలూపాడు.

అదే రూములో ఉన్న చిన్నటేబులు దగ్గర కూర్చున్నాడు, సహజనూ కూర్చోమన్నాడు.

"కాన్వెంటు కొత్తగా మొదలుపెట్టాం. పిల్లలు తక్కువగా ఉన్నారు. మీరేమైనా పిల్లల్ని చేర్చగలరా?" అని అడిగాడు.

"ప్రయత్నిస్తాను" అంది.

"ఇంగ్లీషులో మాట్లాడాలి తెలుగు మాట్లాడకూడదు" అన్నాడు.

"అలాగేలేవయ్యా నువ్వు కోరినట్టే ఇంగ్లీషు మేడమ్ అయిపోద్దిలే, కమీషనర్ రికమెండేషను, తీసుకోక తప్పదు. నువ్వు రేపట్నించి వచ్చే మాష్టమ్మా" అన్నారాయన.

కుర్ర ప్రిన్సిపల్ అవేం పట్టించుకోలేదు "ఐ విల్ ట్రై" అనాలి అన్నాడు.

ఆ రకంగా కోనాకాన్వెంటులో ఉద్యోగం వచ్చింది సహజకి.

క్లాసుకి వెళ్ళిన రోజునే గ్రహించింది, ఈ గదులు క్లాసుల కోసం కట్టినవి కావని, కోనా కాన్వెంటుకి అర్ధం ఆ రోజే తెలిసింది. స్వరాజ్యం ద్వారా, స్వరాజ్యం కూడా కోన కాన్వెంటులో పన్చేస్తోంది. జాయిన్ అయి రెండు నెలలు దాటింది. కొంచెం నల్లగా పొట్టిగా ఉంటుంది.

కోనా కాన్వెంటు చైర్మన్ పేరు. కోళ్ళ అప్పలనాయుడు. పట్టణానికి దూరంగా ఉన్న తన ఊరుకి దగ్గర్లో పెద్ద పెద్ద షెడ్లు కట్టి దాంట్లో కోళ్ళ ఆలన పాలన కోసుకు తినే సిస్టంతో సహా మొదలుపెట్టాడు. కొన్నాళ్ళా వ్యాపారం బాగానే జరిగింది.

గుడ్లు కోళ్ళు వృద్ధిచెంది. లాభాలార్జించి పెట్టాయి. పక్కనున్న పట్నానికే కాక కాస్త దూరపు పట్నాలకి కూడా గుడ్లు పంపాల్సి వచ్చేది. అప్పుడు ఓ సెకెండ్ హేండ్ వేన్ కొని దాన్ని వో కేజ్‌లా తయారు చేసాడు, కోళ్ళనాయుడుగా పేరూ ప్రతిష్ట తెచ్చుకున్నాడు.

వేన్లో గుడ్లు పంపవచ్చు, కోళ్ళు పంపవచ్చు, చికెన్స్ పంపచ్చు ఆ వేన్ పక్కఊర్లు తిరుగుతూ, కోళ్ళు, గుడ్లూ ఎక్స్ పోర్టు బిజినెస్‌ని పెంచిపోషించింది. ఈ ఎక్స్‌పోర్టు చేసే డిపార్టు మెంటులో వాళ్ళు పరాయివాళ్ళు కావడం చేత, కోళ్ళూ గుడ్లూ ఉత్తత్తి బావున్నా కాసులు పంట తక్కువైపోయింది.

అదే సమయంలో ఏదో బర్డ్ ఫ్లూ వ్యాధి బయలుదేరి కోళ్ళ ధర పడిపోయింది. కోళ్ళ ధర తగ్గింది. కానీ కోళ్ళు తినే తిండి బర్డ్ ఫీడ్ మాత్రం తగ్గేలా, ఆ విధంగా కొంత, ఎక్స్ పోర్ట్ వాళ్ళవల్ల కొంత, కోళ్ళ అప్పలనాయుడు కోళ్ళవల్లే చెడ్డాడు.

చెడి బతికాడు అన్న సామెతలాగ అప్పలనాయుడు చెదిపోయిన సమయానికి పట్నం విస్తరించింది. చదువుకి విలువ పెరగలేదు కానీ డిమాండు పెరిగింది.

ఆ సమయంలోనే కోళ్ళు ఏదో గాలి సోకి చచ్చిపోయి షెడ్లు ఖాళీ చేసేసాయి. అదే అదనుగా అతని బావమ్మర్ది సూపర్ సలహా ఇచ్చాడు "బావా కాన్వెంటు మొదలు పెట్టాడు కోళ్ళ అప్పలనాయుడు.

ఆ ఊరికి దగ్గరగా ఓడిపోయి ఖాళీగా కూర్చున్న ఎమ్మెల్యే చేత రిబ్బను కత్తిరింపచేసాడు.

అలా మొదలయింది. కోనా కాన్వెంటు.

అలా మొదలయిన కాన్వెంటులో కోనా బామ్మర్ది ఫుల్ స్కేలు, ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా జాయినయాడు. స్కూలుకి తెలుగుని యాసగానూ ఇంగ్లీషుని భేషుగ్గాను మాట్లాడే కుర్రాడిని ప్రిన్సిపాల్‌గా చేసుకున్నాడు.

''వీడు ఇంగ్లీషో ఇంగ్లీషో అంటూ బుర్ర తింటున్నాడు'' అంది స్వరాజ్యం.

''మరి ఇంగ్లీషు అక్కర్లేదా?''

''ఎందుకూ సిట్! స్టాండ్ నాజూగ్గా ''బాబా బ్లాక్ షిప్, వైట్ హెన్స్ ఎల్లో చికిన్స్'' అంటూ పగలబడి నవ్వింది స్వరాజ్యం.

కాన్వెంటులో చేరిన సాయంకాలమే ప్రిన్సిపాల్‌ని కలిసి ''స్కూలుకి పొద్దున్నే ఎన్ని గంటలకి రావాలండీ?'' అనడిగింది. ఆయన సీరియస్‌గా ''నో దిస్ ఈజ్ కాన్వెంటు మైండ్ ఇట్'' అన్నాడు.

అప్పుడే వాతావరణం చల్లబడింది మేఘాలు కమ్మేయి పెద్దగాలి దుమారం లేచి. ఎక్కడ్నుంచో కోడి వెంట్రుక ఎగిరొచ్చి ప్రిన్సిపాల్ తల్లో చిక్కుకుంది. ఆయన దాన్ని ''డామిట్'' అంటూ తీసిపారేసాడు.

ఇదే విషయాన్ని స్వరాజ్యానికి చెప్పింది. స్వరాజ్యం నవ్వుతూ ''పరిసరాలు బాగుచేయించకుండా కాంపౌండు కట్టేసాడు. కోళ్ళ ఫారంలో చంపిన కోళ్ళబ్బొచ్చంతా అక్కడా ఇక్కడా పడుంది. అది ఈ కాంపౌండులో గాలేసినప్పుడల్లా ఎగురుతూ ఉంటోంది. పొద్దున్నే తుడుచుకు చావాలి మరి'' అంది.

''ప్రిన్స్‌పాల్ నిన్ను కాన్వెంటు బస్‌లో రమ్మన్నాడా ఏమిటి?'' అని అనడిగింది స్వరాజ్యం గాబరాగా.

''లేదు కానీ కాన్వెంటుకి బస్సుందా?'' అనడిగింది.

కోళ్ళని గుడ్లని తీసుకెళ్ళే వేన్‌ని లోపల నాలుగు బెంచీలేసి వేన్ కింద వేసేసారు. అందులో కూర్చుంటే కోడి రెట్టల కంపు పొరపాట్న కూడా అందులో ఎక్కకు'' అంది స్వరాజ్యం ముక్కు పట్టుకుంటూ.

●●●

కోనా కాన్వెంటుని, కాన్వెంటు స్థాయిలో నడిపి చుట్టుపక్కల పిల్లల్ని ఆకర్షించి, ఎక్కువమంది పిల్లలు జాయిన్ అయేట్టు చెయ్యాలి అంటే ఏం చెయ్యాలి? అని చర్చకు కూర్చున్నారు కోనా కార్యవర్గం.

పిల్లలు ఎక్కువమంది చేరాలంటే పిల్లల కన్నా తల్లితండ్రులు స్కూలు పట్ల ఆకర్షితులవ్వాలి. వాళ్ళకి ఇక్కడి వాతావరణం బాగా నచ్చాలి అంటే కాన్వెంటు షెడ్లలో శుభ్రత, షెడ్లు పూర్తిగా మార్చేయాలి అంటూ సలహా ఇచ్చాడు వెర్రి ప్రిన్సిపల్. వాడికి ఆ షెడ్లలో క్లాసుని పిల్లల్ని చూస్తే బలికోసం సిద్ధంగా ఉన్న కోళ్ళు జ్ఞాపకం వచ్చుంటాయి. ప్రిన్సిపల్‌ని గుర్రుగా చూసాడు కోళ్ళనాయుడు. ఈ ప్రిన్సిపల్‌కి ఇంగ్లీషు ముక్కలొచ్చుగానీ వ్యాపారం ఏం తెలుసు. ఈ షెడ్లు మార్చాలంటే ఎంత ఖర్చవుద్ది. అసలే కోళ్ళ వ్యాపారం చితికి పోయికదా కాన్వెంటు పెట్టుకున్నది. ప్రిన్సిపలు ఇట్టాంటి సలహా చెప్తాడేంటి అనుకున్నాడు.

కోళ్ళనాయుడి బామ్మర్ది లేచి ''కాన్వెంటుకి ఆయువుపట్టు అందులో పన్చేస్తున్న మాష్టరమ్మలు, మాష్టర్లు, వాళ్ళు మాట్లాడే ఇంగ్లీషు భాష యాస. ఆఖర్న ముఖ్యమైంది ఆళ్ళయాస. యాసకి పదునుండాల సూసేసర్కి దొరసానమ్మలా ఉండాల. ఎందుకు కాన్వెంటంటే దొర్లస్కూలు కాబట్టి. ఈళ్ళని సూడగానే తల్లితండ్రులు ఎట్రాక్ట్ అయిపోవాల. కుర్రాళ్ళని తీసుకొచ్చి స్కూల్లో జాయిన్ చేసేయాల దొరసానమ్మలు దొరసానాళ్ళెందుకయారు. కట్టుబొట్టులో తేడా సూపించికదా'' అని ఇంకేదో చెప్పబోతున్నాడు కొనా బామ్మర్ది.

స్వరాజ్యం టక్కున లేచి ''అంటే మేం గౌన్లు తొడుక్కురావాలా'' అంది అసహనంగా.

కోనా బామ్మర్దికి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. వీళ్ళందరూ చీరలు తప్ప మరొకటి కట్టి ఎరగరు. ఇప్పుడు ఏదేనా మార్పు సూచిస్తే వీళ్ళు పాటిస్తారా అన్న అనుమానం వచ్చింది. కానీ తడబడకుండా.

"గౌన్లు వేసుకోనక్కరలేదు మన ఛైర్మన్ కోనాగారు చెప్పినట్టు స్లీవ్‌లెస్ బ్లౌజు వేసుకోవాలి. లిప్‌స్టిక్ పెట్టుకోవాలి, అంతే ఈ చిన్న మార్పు వలన మన మ్యాష్టమ్మలందరూ దొరసాన్లయిపోతారు. మనం పిల్లల తల్లితండ్రుల్ని ఆకర్షించగలుగుతాం. మన కాన్వెంటు మోడ్రన్‌గా తయారవుతుంది."

ఛైర్మన్ బుర్ర గోక్కోడం కనుబొమలు మడవడం చూసాక ఇది కోనా బామ్మర్ది ఆలోచనేగానీ కోనాగారిది కాదని అర్థం అయిపోయింది. కానీ కోనాగారు దీన్ని సమర్థిస్తారు. అన్న విషయం కూడా అర్థం అయింది.

ఎందుకంటే కోనాగారికి చికెన్ అంటే ఎంత ఇష్టమో జబ్బల్లేని జాకెట్టేసుకునే మరకతం మరీ ఇష్టం.

"మరకతం జబ్బల్లేని జాకెట్టు గురించి తర్వాత చెప్తాలే" అంది స్వరాజ్యం.

మీటింగ్‌లో తీర్మానించిందేమిటీ అంటే వచ్చేవారం నుండి టీచర్లందరూ జబ్బల్లేని జాకెట్టు వెయ్యాలి, ఒకేరంగు లిప్టిక్ వెయ్యాలి. మళ్ళీ రంగులు తేడాలొస్తాయేమో ఆ లిప్‌ష్టిక్ కాన్వెంటే కొనిస్తుంది.

●●●

ఇలాంటి తీర్మానాలతో కాన్వెంటుని ప్రపంచ స్థాయిలో నిలబెడదామనుకునే కోనా బామ్మర్ది ఆలోచనలకి రూపకల్పన చేస్తూ ఒక జాకెట్టుకి ఉన్న చేతులూడదీసింది. చేతులూడదీయడం వల్ల జబ్బల్లేని జాకెట్టు తయారవదని అర్థం అయింది అంతేకాక జబ్బల్లేని జాకెట్టు వేసుకోగానే సరికాదు, దానికి జబ్బల్లో బోల్డ్ మెయింటినెన్స్ చెయ్యాలని అర్థం అయింది.

ఆ రోజే కాలేజీలో మరకతం, రాజీమేడం దెబ్బలాడుకున్నారు. ఇద్దరూ ఒకర్నొకరు చాలా దారుణంగా బూతులు తిట్టుకున్నారు. కొట్టుకున్నారు. ఇద్దరి క్లాసులో పిల్లలూ చోద్యం చూస్తూ నిలబడిపోయారు. ఇద్దరూ జుట్లే పీక్కున్నారు. కానీ బట్టలు చింపుకోలేదు.

మరకతం కోళ్ళ అప్పలనాయుడికి దూరంగా అంటే (డిస్టెంట్ రిలేషన్) మరదలు వరస. ప్రిన్సిపలు కుర్రాడికన్నా తనే పవర్‌ఫుల్ అన్నట్టు ప్రవర్తిస్తుంది. అందుకే ఆ స్థానాన్ని మరొకరు కొట్టెయ్యకూడదు అనుకుంటుంది. రాజీ నిన్నంతా కోళ్ళ అప్పలనాయుడు కారులో తిరగడం సహించలేకపోయింది.

ఇద్దరూ నువు సాని అంటే నువు కంత్రీ అంటూ యథాశక్తి తిట్టుకుని వాతావరణం రక్తి, కట్టించేట్టుగా కొట్టుకున్నారు.

అదివిని కోళ్ళనాయుడు విసుక్కున్నాడు. మరకతాన్ని పిలిచి మందలించాడు "నేనేం తప్పుచేసాను బావా నిన్నామాయలాడి వల్లో వేసుకోకుండా సర్ది చెప్పాను" అంటూ కళ్ళనీళ్ళెట్టుకుంది.

ఆ పాటికి కోళ్ళనాయుడికి ఎవరి వలలో పడాలో, ఎవరి ఒళ్ళో పడాలో తెలియనట్టు సర్టిఫై చేసేసింది మరకతం.

ఆ రోజే టీచర్లందర్నీ పిలిచి. లిప్‌స్టిక్‌లు అందించాడు. ప్రిన్సిపాల్ అవి ఎలా తెరవాలో ఎలా వేసుకోవాలో చెప్పింది మరకతం.

ఎర్రగా బైటికి వస్తున్న లిప్‌ష్టిక్‌ని చూస్తే జుగుప్సాకరంగా అనిపించింది. అది వేసుకుని స్కూలికి రావాలా అని దిగులేసింది సహజకి.

●●●

లిపిష్టిక్ పంచిన నెలలో దాని ఖరీదు జీతంలోంచి కోసేసారు. సహజ నలుగురైదుగురు విలవిలలాడారు. అందులో స్వరాజ్యం మరీ విలవిల్లాడింది.

"నూటేభై లిపిష్టిక్ కట్ చేసారే"

"........"

"అంత ఉంటుందా?"

"తెలీదు"

"నూటేభై రూపాయలుంటే ఏ ఖర్చుకేనా సరిపోనే, ఇప్పుడు నా అందానికేం తక్కువ" అంది. అంటే అది ఆ నూటయాభైకి ఎంత వాచిపోతోందో అర్థం అయింది.

నూటయాభైకే కాదు ప్రతీపైసాకి కక్కుర్తిపడాల్సి వస్తోంది. అలా ఉన్నాయి. వీళ్ళ జీతాలు ఈ జీతాలు తీసుకుని ఇంగ్లీషు మాట్లాడినా ఒకటే తెలుగు మాట్లాడినా ఒకటే. దానికి తోడు.

"మూతికా రంగులేమీటే?"

"స్కూలు వాళ్ళు వేసుకోమన్నారు"

"స్కూలు వాళ్ళకేం అవసరం"

"అది వాళ్ళనే అడుగు"

"అది స్కూలేనా?"

"కాదు కాన్వెంటు"

"మరి సింగారం ఎందుకు?"

".........."

"పిల్లలకి నాలుగు ముక్కలు చెప్పడానికి సింగారాలు కావాలా?"

అన్నీ అనుమానాలే. అవును నిజమే పిల్లలకి చదువు చెప్పడానికి మూతికి రంగుండాలా? మూతికి రంగేసినంతమాత్రాన, స్కూలికి ఒరిగేదేమిటి? సహజ ఆలోచనల్లో పడింది.

తల్లి సణుగుడు మానేదు.

"ఎవడికోసమో ఈ సోకులు"

"ఎవడికోసమో అయితేనే ఈ సోకులు చేసుకోవాలా?"

"మరి దేనికి. చూసేవాడెలాగూ వదిలేసిపోయాడు"

"వాడు వదిలేసిపోలేదు. నేనే వాడితో వెళ్ళలేదు"

"ఏదైనా ఒకటే"

"ఏదైనా ఒకటే ఎలా అవుతుంది?"

ఆడది సింగారించుకునేది మొగాడికోసమే. సంసారి అయితే మొగుడి కోసం సానిది విటుడి కోసం నువ్వు ఎందులోకి వస్తావో చూసుకో. అన్నట్టుంది అమ్మ వ్యవహారం అవును ఎందులోకి వస్తుంది?

"నువ్వింక నోర్మూయ్యి." అమ్మేదో సణుక్కుంది. నోర్మూయ్యి అన్నందుకు పీక్కుంది. సద్దుమణిగింది. కానీ స్వరాజ్యం దొండపండ్లలాంటి పెదాలు కొరుక్కుతింటానికే" అంటూ నవ్వింది.

"ఈ పిల్లలకి శృంగారం ఏం తెలుస్తుంది?"

"వాళ్ళకి తెలీదు మనకి తెల్సుకదా. మరకతం అయిదో తరగతి మగపిల్లల్ని ఇంటికి పిలిపించుకు వళ్ళురుద్దించుకుంటుంది. నీకు తెలుసా?"

"నిజమా?"

"ఆ చాలామంది అది చూసారు. పిల్లల్ని అడిగితే చెపుతారు."

"సిగ్గెయ్యదూ?"

"ఎవరికి పిల్లాడికా?"

"......"

"సిగ్గేస్తే ఎందుకు చేస్తుందీ పిల్లాడ్ని ఒరేయ్ వీపురుద్దరా అని పురమాయిస్తుంది. వాడేది రుద్దినా ఊరుకుంటుది."

"తెలుసనే అనుకుంటున్నా. మన ఆడతనాన్ని ప్రదర్శించి సొమ్ము చేసుకుందామనే ఆలోచనే ఈ లిప్‌స్టిక్"

"మన సింగారం ఆకర్షణకే అందులో రెండో ఆలోచనేలేదు. అయితే స్కూలుకొచ్చే తల్లితండ్రులకా, పిల్లలకా అన్నది సందేహం."

"సందేహం లేదు. పేరెంట్స్ కోసమే"

"లిప్‌స్టిక్.. జబ్బల్లేని జాకెట్టు. లేకపోతే స్కూలు నడవదనుకోడం ఎంత మూర్ఖమో?"

"మూర్ఖం కాదు, ఎక్స్‌ప్లాయిటేషను. నీ శరీరాన్ని ఆకర్షణగా పెట్టికాసులు చేసుకోచూడడం గొప్ప వ్యాపారపు ఆలోచన."

అలాంటి వ్యాపార ఆలోచనల్లోంచి పుట్టిందే "టై" టీచర్లందరికీ లిప్‌స్టిక్ లిచ్చిన వారం రోజులకి, పిల్లలందరికీ `టై` కంపల్సరీ చేసారు.

ఆ టైని స్కూలు వాళ్ళే అమ్ముతారు. టై ఖరీదు యాభైరూపాయలు. ఈ విషయం తెల్సిన రెండోరోజే స్వరాజ్యం పిల్లలకి టై కంపల్సరీ చెయ్యడం వెనక ఉన్న ఆర్థికతత్వం చెప్పింది.

"ఒక మీటరు గుడ్డకి, ఇరవై టైలు అవుతాయి. కుట్టుకూలి బేడ్జీ అన్నీ కలిపి "టై" విలువ పన్నెండు రూపాయలు దాన్ని యాభైరూపాయలకి అమ్ముతున్నారు. అంటే 38 రూపాయలు స్కూలుకి లాభం అన్నమాట."

కోళ్ళనాయుడి బామ్మర్ది బుర్ర ఎప్పుడూ ఏ కొత్త ఎత్తు ఎత్తి పిల్లల దగ్గర్నించి డబ్బు ఎలా రాబట్టుకుందామా? అని ఉంటుంది.

స్వరాజ్యం చెప్పినట్టు "డబ్బు పిచ్చి లంజికొడుకు" నెలంతా పనిచేయించుకుని,

" నువ్వు సరిగా చెప్పడం లేదు నీ ఇంగ్లీషు బాలేదు. " అంటూ జీతంలో పావువంతు కొట్టేస్తాడు. మొన్నో అమ్మాయి బాగా ఫ్లూయెంట్‌గా ఇంగ్లీషు మాట్లాడేది వచ్చింది. నెల రోజులు పాఠం చెప్పింది. పిల్లల్ని బాగా ఆకట్టుకుంది. దానికీ రెండువేలే చేతిలో పెట్టేడు. అదేంటి ఒప్పందం అయిదువేలుకదా అంటూ ఇంగ్లీషులో దెబ్బలాట వేసుకుంది.

"అబ్బే మీకు బి.ఇ.డి సర్టిఫికెట్ లేదు" అంటూ ఆ అమ్మాయి వాదాన్ని కొట్టిపారేసాడు.

"ఇంతోటి బోడి స్కూలుకి బి.ఇ.డి సర్టిఫికెట్ కావాలా?" అంటూ ఉద్యోగం వదిలి వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి చేసినన్నాళ్ళూ ఆవిడ్ని చూసి నేర్చుకోండి అన్న ప్రిన్సిపల్ ఇలాంటి పొగరున్న టీచర్ల వల్ల స్టూడెంట్స్ చెడిపోతారు అంటూ వాపోయాడు.

●●●

అకస్మాత్తుగా కోళ్ళనాయుడు టీచర్ల మీటింగ్ పెట్టాడు, అందులో "టీచర్లంత గొప్పవాళ్ళు లేరు దేశాన్ని భవిష్యత్తులో నడిపించేది మీరే. పిల్లల భవిష్యత్ బావుంటే దేశం భవిష్యత్తు అదే బావుంటుంది. అందుకని టీచర్స్ చిన్న చిన్న విషయాలు పట్టించుకోకుండా శ్రద్ధగా పిల్లల్ని తీర్చి దిద్దాలి. " అంటూ ఉపన్యాసం మొదలుపెట్టాడు.

ఇవన్నీ అయాక స్కూలు ఇంకా అభివృద్ధి చెందాలని, స్కూలుకి వస్తున్న ఆదాయం దాని ఖర్చులకే సరిపోతుందని అందుకే అనుకున్నంతగా జీతాలు ఇవ్వలేకపోతున్నామని ఆ విషయాన్ని మనసులో పెట్టుకోకుండా మీకిచ్చిన ఎపాయింట్ మెంట్ లెటరులో ఉన్న సేలరీ డి.ఇ.ఒ అడిగితే చెప్పాలని చెప్పాడు. ఆ మర్నాడు డి.ఇ.ఒ ఇన్స్పెక్షన్ అన్న విషయం అర్థం అయింది అందరికీ.

స్కూలు వాతావరణం మారిపోయింది. అద్దెకి జారుడు బల్ల తెచ్చారు. పిల్లలాడుకునే గ్రౌండు ఏర్పాటు చేసారు. ఎక్కడెక్కడ షెడ్లు బాలేవో అక్కడ వాల్ పేపర్స్ అంటించారు. అన్నిటికీ మించి కోళ్ళవేన్! పిల్లలని తీసుకొచ్చే దాన్లో బెంచీలు తీసేసి. సీట్లు వేయించారు.

ఈ పన్లు చేయిస్తూ స్వరాజ్యం, నాలుగో తరగతి టీచరు ఇద్దరూ క్లోజు అయ్యారు. స్వరాజ్యానికి అందం టిప్స్ చెపుతూ, కుర్రటీచరు ఎలాంటి బ్రాలు వేసుకుంటే జబ్బల్లేని జాకెట్టు బావుంటుందో. ఏ డియోడ్రెంట్ వాడితే మంచిదో అన్నీ వివరంగా చెప్పాడు. ఇంకా చాలా మాట్లాడేడు. అంటే స్వరాజ్యాన్ని అతడెంత నిశితంగా పరిశీలిస్తాడో అర్థం అయింది. అతడు పిరుదల గురించి చెపుతున్నా, నడుంలో ముడతల చెపుతున్నా, బాగా ఎంజాయ్ చేసింది స్వరాజ్యం. స్వరాజ్యం అతని లూజ్ టాక్‌ని ఎందుకు ఎంజాయ్ చేసిందో సహజకైతే అర్థం కాలేదు.

మర్నాడు అతను స్వరాజ్యం వెంటపడ్డాడు. అతన్ని పెప్ టాక్‌ని చాలా ఎంజాయ్ చేస్తున్నట్టు కనబడింది. అతన్నెందుకు భరిస్తుందో కనుక్కుందామనుకుంది. కానీ. ఇన్‌స్పెక్షన్ హడావిడిలో ఆ విషయం మరుగున పడింది.

●●●

డి.ఇ.ఒ. ఇన్‌స్పెక్షన్ రోజున మరకతాన్ని స్కూలుకి రావద్దన్నాడు కోళ్ళనాయుడు.

ఇన్‌స్పెక్షన్ రోజునే ఎవరో ఒకతను వచ్చి ప్రిన్స్‌పాలు సీట్లో కూర్చున్నాడు.

డి.ఇ.ఓ పూర్వాశ్రమంలో స్కూలుకి హెడ్ మాష్టరు. అతని పేరు సర్వారాయుడు. ఇంటిపేరు అంకుశం వెరసి అతని పేరు అంకుశం సర్వారాయుడు. అతను పడమటోడు. కోళ్ళనాయుడు తూర్పు సరుకు. సర్వారాయుడు ప్రతీమాత చివర్న 'ఆయ్' అంటూ ఉంటాడు. కోళ్ళనాయుడు ప్రతీమాతకి ముందో వెనకో 'మరి' అలవాటు.

"నాయుడు గారు స్కూలుకి పక్కాగా బిల్డింగ్స్ కట్టేది ఉందా లేదా ఆయ్"

"మరండీ స్కూలుకి అంత ఆదాయం లేదు కదండీ త్వరలో కన్‌స్ట్రక్షన్ మొదలుపెడతాం"

"ఎంత మంది టీచర్లు?"

" మరండి లేకేం ఎనిమిదిమంది ఉన్నారు"

"చూడండి నేను అడుగుతున్నది క్వాలిఫైడ్ టీచర్ల గురించి బతుకుతెరువు కొచ్చినవాళ్ళ గురించి కాదు ఆయ్"

"సహజ ఉందిగా.. టీచర్ ట్రైనింగ్ అయింది మరి."

"ఎవరో ఒకరో అరాకాదు అందరూ క్వాలిఫైడ్ అయివుండాలి ఆయ్"

"మరండి స్కూలుకి రాబడి అంతంత మాత్రమేనండి. మా కష్టాలు మీరు కూడా గమనించాల. మరి"

"రెండు వందల మంది స్టూడెంట్స్‌ని చూపిస్తున్నావుగా ఆయ్"

"మరి అలా చూపించకపోతే స్కూలికిచ్చిన పర్మిషన్ కేన్సిల్ చేయిస్తారేమోనని భయం. ఈ చుట్టుపక్కల స్కూలు అవసరం ఎంతేనా ఉందండి. అందుకని నష్టాలైనా భరించి స్కూలు నడుపుతున్నాం మరి"

"నువ్వు స్కూలెక్కడ నడుపుతున్నావయ్యా.? ఇది షెడ్, అదీ పూర్వం దేనికివాడేరో తెలీదు గానీ, ఎంత కంపుకొడుతుందంటే కురుక్షేత్రంలా రక్తం కంపుకొడుతుంది ఇంక మీ టీచర్లెవరూ క్వాలిఫైడ్‌కాదు. ఎటెండెన్స్ వెయ్యడం రాదు. మార్కులు వేస్తే అందులో ఎన్ని కొట్టివేతలో! ఇలాగేనే స్కూలు నడిపేది? తెలీకపోతే ఎవర్నేనా తెలిసిన వాళ్ళని తెచ్చివేసుకోండి. ఆయ్..అయినా స్కూలు టీచర్లు టీచింగ్ ఎయిడ్స్, టీచింగ్ మోడల్స్, చెయ్యరా, మీ టీచర్లందరూ బద్ధకస్తులే. అందుకే పిల్లలు చెడిపోతున్నారు. " అంటూ సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చి, కోళ్ళనాయుడిచ్చిన కవరు పుచ్చుకుని, అంతా బాగానే ఉందిగాని, ఇంకా అభివృద్ధి చెయ్యాలి. అని రాసిపోయాడు.

●●●

కోళ్ళనాయుడికి చాలాకోపం వచ్చింది. స్కూల్లో టీచర్లెవరూ సరిగా పన్జేయడం లేదన్న తపన పట్టుకుంది. ఆ విషయం డి.ఇ.ఓ. చెప్పాడు కూడా.

ఆ సమయంలోనే బొబ్బిలి నుండి ఉడతల రాంబాబు టీచింగ్ పోస్టుకి ఎప్లై చేసాడు.

డిగ్రీలు చాలా ఉన్నె! వెంటనే ఎపాయింట్‌మెంటు చేసేసాడు కోళ్ళనాయుడు. చేసి ఊరుకున్నాడా ఈ కాన్వెంటులో టీచర్లందరూ, ఎవరూ సరిగ్గా లేరని వీళ్ళకి కనీసం ఎటెండెన్స్ వెయ్యడం, పేపర్లు దిద్దడం రావట్లేదని వాపోయాడు.

"అసలు టీచర్లు రోజూ స్కూలుకి వస్తున్నారా??" అంటూ డౌటు పడ్డాడు ఉడతల రాంబాబు.

వెంటనే కోళ్ళనాయుడికి పాయింట్ దొరికింది. ప్రిన్సిపాల్ వేపు తిరిగి "ఏమయ్యా హెడ్ మేష్టర్? టీచర్లెవరూ స్కూలుకి సరిగ్గా రావట్లేదటగా. మీరు సరిగ్గా చూసుకోరండీ ఇలా అయితే ఎలా?" అంటూ పేట్రేగిపోయాడు.

"పొద్దున్న సాయంకాలం సంతకాలు పెట్టిస్తున్నాం కదండీ" అంటూ నీళ్ళు నమిలేడు హెడ్ మేష్టు.

"అవును సంతకాలు వాళ్ళు పెడుతున్నారని నమ్మకం లెండి రాంబాబుగారు.." అన్నాడు కోళ్ళనాయుడు.

"ఎవరి సంతకాలు వాళ్ళు పెడుతున్నారని నమ్మకం ఏంటి, ఒకళ్ళవి ఇంకొకళ్ళు పెట్టొచ్చు కదా" రాంబాబు లాజిక్ దాని వెనక స్వానుభవం ఉంది.

"అవునయ్యా హెడ్ మాష్టూ అవన్నీ చూసుకోవద్దూ? ఒకళ్ళ సంతకాలు ఒకళ్ళు పెట్టేస్తూ ఉంటే నువ్వు ఏం చేస్తున్నావ్?" అంటూ ఒంటి కాలిమీద లేచాడు నాయుడు.

హెడ్ మాష్టారి సంతకాలు వాళ్ళే పెడుతున్నారని నెత్తీ, నోరూ మొత్తుకున్నా. కోళ్ళనాయుడు వప్పుకోలేదు.

"మరి టీచర్లందర్నీ దొంగసంతకం పెట్టకుండా ఆపడం ఎలా?" అన్నది ప్రస్తుత సమస్య అయికూర్చుంది.

అప్పుడు ఉడతల రాంబాబు తలలో వో తెలివైన ఆలోచన మెరుపులా మెరిసింది.

"బయొమెట్రిక్ ఎటెండెన్స్ పెడితే" అన్నాడు.

కోళ్ళనాయుడు ఆశ్చర్యపోయాడు తనకి అలాంటి ఆలోచన రానందుకు దాని గురించి తెలియనందుకు చాలా బాధపడిపోయాడు. "దానివల్ల లాభం ఏమిటి?" అన్నాడు.

"మన కాన్వెంటుకి వస్తాం.. నడిచి రావాలిగా కాలిముద్రలేయిస్తే"

"కాలిముద్రలెలా వేయిస్తాం"

"కాన్వెంటు ముందు బురద పెడతాం అది తొక్కొచ్చి ముద్రవెయ్యాలి"

"ఇదేదో గలీజుగా ఉందయ్యా, ఇంత బురదేటయ్యా నీ బుర్రలో వేలిముద్రతో సరిపెట్టు చాలు" అన్నాడు. రాంబాబు కొంచెం ఆలోచించి.

"ఈ విషయం జూలై ఓపెనింగ్ నాడు చెపితే మంచిది. ఇప్పుడైతే. వీళ్ళు మరో స్కూల్లోకి మారిపోతారు" అంటూ సలహా పారేసాడు.

ఇలాంటి సలహాలు కోళ్ళనాయుడికి బాగా నచ్చుతాయి. కోళ్ళనాయుడి ఆలోచన ప్రకారం పిల్లల తల్లితండ్రులు కానీ, టీచర్లు కానీ, ఎప్పుడూ ఏడుస్తూ ఉండాలి అది తనకి శ్రీరామ రక్ష! ఈ అగ్నికి ఉడతల రాంబాబు ఆజ్యంలా దొరికాడు.

అక్కడితో ఆగకుండా ఉడతల రాంబాబు, కోనాకి డబ్బు కూడవేయడానికి మరో ఉపాయం చెప్పాడు.

అదే వేసంగి శలవుల్లో టీచర్లకి జీతాలియ్యనవసరం లేదని, కోనా అదే పాటించాడు. చాలామంది టీచర్లు తిట్టుకున్నారు. కానీ ఇక్కడున్న తిరకాసు ఏంటంటే ఉడతల రాంబాబుకి కూడా సేలరీ ఇవ్వలేదు. కోనాకి తరతమ బేధం లేదు మరి. కాసులు మిగుల్తాయన్న ఆలోచన తప్ప.!

వేసంగి శలవుల్నుంచి స్కూలు కొచ్చిన పిల్లలకి, పుస్తకాలు స్కూలిస్తుందని తెలిసి ఆశ్చర్యపోయారు. దానికి తోడు బిల్డింగ్ ఫండ్ అయిదువేలు.

ఏదో కొందరు కట్టేరు, కొందరు కట్టలేదు. కట్టలేని వాళ్ళు పిల్లల్ని స్కూలు మార్చాలన్నా కష్టమే అవుతుంది. అని తిట్టుకుంటూ కట్టేరు.

అందరికీ తెలుసు ఈ రోజుల్లో స్కూలంటే, టై, వాటర్ బాటిల్ వీపు మీద పదికేజీల బరువు, ఇంటికొచ్చిన వాళ్ళముందు - ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్. ఖర్చు తక్కువుండాలి. మావాడు కాన్వెంటు కెళుతున్నాడని పక్కవాళ్ళకి చెప్పుకోవాలి, అదో నెసిసిటీ అయిపోయింది. అందుకే ఈ కాన్వెంట్లు!

అయిదువేలు కట్టారు. ఆ కోళ్ళ ఫారం, కోడిరెట్టల మధ్య కోళ్ళలా బలి అయిపోయినందుకు ఏడుస్తూనే అయిదువేలు కట్టారు.

టీచర్లందరూ ఏడుపు మొహాలతో స్కూల్లో జాయిన్ అయారు, దానికి కారణం సమ్మరులో జీతాలుండకపోవడమే ఇంత జరుగుతున్నా స్కూలు డిమాండ్ పెరిగింది.

స్కూలు సజావుగా జరిగిపోతే ఉడతల రాంబాబుకి నిద్రపట్టదు. తనేదో సలహా చెప్పేయాలి అది మేనేజ్‌మెంట్ మెచ్చేసుకోవాలి అది అతని "మేధో దురద"

అందుకే ఉడతల రాంబాబు మరకతం కలిసి అప్పన్నని సిఫార్సు చేసారు, ఎక్కడా ఉద్యోగం లేక తిరుగాడుతున్నాడని చెప్పారు.

అప్పన్న పూర్వాశ్రమంలో కోళ్ళనాయుడి పౌల్ట్రీలో కోళ్ళు లెక్కపెట్టడం గుడ్లు పెడతాయో చెప్పెయ్యగలడు. రోజా క్లీన్ చేసిన కోడి బొచ్చుని చూసి ఎన్ని కోళ్ళని చంపారో చెప్పయ్యగల దిట్ట! తిరుగులేని అప్పన్న లెక్కలకి కోళ్ళనాయుడు ఆశ్చర్యపోతుండేవాడు.

అందుకే అప్పన్న ఎక్కడా పన్చేయడం లేదని తెలిసి, కాన్వెంటుకి రేపటినుంచీ వచ్చెయ్ అంటూ ఉద్యోగం ఇచ్చేసాడు. అప్పన్న కాన్వెంటులో జాయిన్ అయితే అయాడు కానీ కోళ్ళని లెక్కకట్టినంత తేలిగ్గా పిల్లల్ని లెక్కకట్టలేం. అని అర్థం చేసుకునే సరికి చాలా రోజులు పట్టింది. ఎందుకంటే వీళ్ళకి బొచ్చుండదు.

అందుకే ఎప్పుడూ లెక్క తప్పేది. కాని అలా లెక్కకట్టే ప్రయత్నంలో స్టూడెంట్స్‌కి దగ్గరయ్యాడు.

స్టూడెంట్స్ స్టయిల్‌గ దేశీ తెలుగుకి అంగ్రేజీ స్లాంగ్ జతచేసి "అప్పనం సార్" అని పిలిచేవాళ్ళు.

ఈ అప్పనం సార్‌కి ఏ పని చెప్పాలా చాలావరకూ తర్జన భర్జన పడి, లెక్కలు బాగా వచ్చు కాబట్టి ఎగ్జామినేషన్ సెక్షన్‌కి ఇన్‌చార్జ్ చేసారు.

అప్పనం సార్‌కి లెక్కలొచ్చు అందుకే పిల్లలకి మౌఖిక పరీక్షలు మొదలుపెట్టాడు.

అతనికి అనిపించందేమిటంటే ఎలాగూ పిల్లల్ని పాసుచెయ్యాలి కాబట్టి రాత పరీక్షయితేనేమి మౌఖిక పరీక్షలయితేనేమి? కాబట్టి డబ్బు ఖర్చులేకుండా పరీక్షల్లేకుండా స్కూలేంటి అన్నాడు.

కానీ కోళ్ళనాయుడికి అదేం పట్టలా. ఏడాదికి కొనాల్సిన స్టేషనరీ ఖర్చు తగ్గిందని సంతోషించాడు.

ఈ ఏర్పాటు మరకతంకి కూడా నచ్చింది. ఎందుకంటే ఈ పరీక్షలు పెట్టడంలో లేదు. పేపర్లు దిద్దడంలో లేదు. కాన్వెంటుకి ఖర్చు ఎలా తగ్గించాలి. ఆదాయం ఎలా పెంచాలి. అన్న ఆలోచనల్తో సతమతమైపోతోంది మరకతం.

●●●

ఆ సమయంలోనే స్కూల్లో కుర్రాడికి తేలుకుట్టింది. వాడేడ్చాడు. వాడి తల్లేడ్చింది. నాన్న స్కూలు మీద దండయాత్రకి వచ్చాడు.

కోళ్ళ అప్పలనాయుడు "అలా కుట్టుకూడదే" అన్నాడు. కానీ ఎలా కుట్టాలో చెప్పలేదు.

"అది తేలుకి తెలీదు లెండి" అన్నాడు ఉడతల రాంబాబు.

"ఎందుకు తెలీదు కుడితే టీచర్లని కుట్టాలిగాని, గుంటడ్ని ఎందుకు కుట్టిందని" కోనా డౌట్.

"అదికూడా దానికి తెలీదులెండి" అన్నారు ఉడతలవారు.

మరకతం మాత్రం "తెలుసుకోవాలి రాంబాబూ స్కూలు పెట్టి ఇన్నాళ్ళయింది. స్కూల్లోనే ఉంటూ తెలీదంటే ఎలా?"

హెడ్ మాష్టారు మాత్రం "మనం ఉండగా దానికా శ్రమ ఎందుకనుకుందో" అన్నాడు.

"అంటే" అంది మరకతం అనుమానంగా మనం మన ఉనిక్కి వేలి ముద్రవేసినట్టు అది దాని ఉనిక్కి "తోకముద్ర వేసింది. అంతే" అన్నాడాయన ఏం మాట్లాడాలో తెలీక.

అలా తేలు ఎందుకు కుట్టింది, కుట్టాల్సిన అవసరం ఏమొచ్చింది. అంటూ కోనా "తేలు కమిటీ" వేసి రిపోర్టు పదిరోజుల్లో కావాలన్నాడు.

తేలు కమిటీలో మరకతాన్ని, ఉడతలవార్ని హెడ్ మాష్టర్ని, కలిపి బైటింగ్ తేలు కమిటీ అని రాసి దానికి బి.టి.సి అని పేరెట్టాడు. అయితే ఈ కమిటీ ఎవర్ని కుడుతుందా? అని అనుమానం పట్టుకుంది అందరికీ. బైటింగ్ ఫీజు వసూలు చెయ్యాలి అని నిర్ణయించారు. ప్రతి కుర్రాడికి బిల్డింగ్ ఫండ్‌తో పాటు నాన్ బైటింగ్ ఫీజు అయిదొందలు తగులుకుంది.

అది చూసి తేలు భోరున ఏడ్చింది. ఎందుకు కుట్టానా అని బాధపడింది. కోళ్ళ అప్పలనాయుడు తేలుకి బైటింగ్ శక్తి ఉన్నందుకు చాలా ఆనందించాడు.

●●●

ఆ సమయంలోనే ఎక్కువ జీతానికి సంతకం పెట్టించుకుని, తక్కువ జీతం ఇస్తున్నారని టీచర్లు కోళ్ళ అప్పలనాయుడికి మొరపెట్టుకున్నారు.

కోళ్ళ అప్పలనాయుడు ఈ విషయం చూస్తానని దాటువేసాడు. కానీ సహజతో సహా కొందరు టీచర్లు సహనం కోల్పోతూ వెట్టి చాకిరీ చేస్తున్నామా? బానిస బ్రతుకా? అంటూ వాపోతున్నారు. కొందరు క్లాసులో పాఠం చెప్పకుండా ఎగ్గొట్టేస్తున్నారు.

ఆ విషయం మరకతంకి గానీ, నాయుడికి గానీ పట్టలేదు. పట్టలేదంటే పట్టింది కానీ ఏం చెయ్యాలో తోచలేదు.

ఇదే సమయం అనుకుందో ఏమో కోళ్ళ అప్పలనాయుడి పెళ్ళాం కోళ్ళ దుర్గ బుర్రలో మెరుపు ఆలోచన వచ్చింది. ఒకే దెబ్బకి రెండు పిట్టలు అనుకుంది.

"ఆ మరకతంకి ప్రస్తుత సమస్యకి ఏం సంబంధం?" కోళ్ళ నాయుడి చికాకు.

"ఇదంతా ఆవిడ వల్లే వచ్చింది. స్కూల్లో కుర్రాళ్ళని వీపు తోమించడానికి, కాన్వెంటు చైర్మన్ తో సరసాలాడ్డానికి తప్ప పనికి రానిది. స్కూలు విషయాల్లో కలుగచేసుకోడం వల్లే మన జీతాల్లో కోతపడుతుంది. ఈ విషయం కోళ్ళనాయుడికి తెలుసో తెలీదో అని మిగతా టీచర్లు అనుకుంటున్నారుట."

"టీచర్లు అంత వెర్రివాళ్ళు కారు నాకు తెలుసని వాళ్ళకి తెలుసు"

"అయితే మరకతంని వదిలించుకోడం వల్ల టీచర్లలో చిన్న ఆశరేకెత్తించవచ్చు. కానీ దాన్ని మార్చడం మీవల్లకాదు" అంది కోళ్ళ దుర్గ.

"అవును చిన్నప్పటినుండి నన్నే నమ్ముకుంది."

"దాన్నే చేసుకోలేకపోయావా?"

"పిచ్చిముండకి ఎవరెప్పుడు నచ్చుతారో తెలీదు. అయినా మీ నాన్న కోళ్ళ ఆశపెట్టాడు అన్నాడు. వేలికున్న ఉంగరంలో పచ్చని పాలిష్ చేస్తూ కోళ్ళ ఫారం నాదేకాబట్టి. కాన్వెంటూ నాదే" అంది దుర్గమ్మ.

అప్పుడు తట్టింది. కోళ్ళ అప్పలనాయుడికి, ఛైర్మన్‌ని మారిస్తే చాలా మార్పులు వస్తాయని.

"నిన్ను ఛైర్మన్ చేస్తాం. మరకతాన్ని తప్పించేయ్. ఆ రాంబాబుగాడ్ని కూడా తప్పిస్తే కాన్వెంటులో ఏవో మార్పులు వస్తున్నాయి అనుకుంటారు. కొత్త ఛైర్మన్ మీద ఆశతో ఉంటారు. కొన్నాళ్ళపాటు జీతాలు పెంచమన్న గోల తప్పుతుంది. ఇదిగో మార్పులు మొదలు పెట్టాంగా. అని నువ్వూ చెప్పొచ్చు" అన్నాడు, కోళ్ళనాయుడు.

మరకతాన్ని తప్పించవచ్చు అని నాయుడు చెప్పగానే కోళ్ళ దుర్గకి ఉత్సాహం వచ్చి, ఛైర్మన్‌గా ఉండడానికి ఒప్పేసుకుంది.

ఛైర్మన్ మారితే, ప్రస్తుతం డబ్బు ఖర్చు కాకుండానే కొంత సమస్య తీరుతుంది. అనిపించింది కోళ్ళనాయుడికి.

ఓ సర్క్యులర్ తయారుచేసి ఆరోగ్యం బాగులేకపోడం వల్ల ఈ రోజునుండి కోళ్ళ దుర్గ కాన్వెంట్‌కి ఛైర్మన్‌గా ఉంటుంది అంటూ సర్క్యులర్ వచ్చింది.

దాన్ని చూడగానే స్వరాజ్యం కోళ్ళనాయుడి పడగ్గదిలో దూరి మిగతా సంభాషణ ఊహించి చెప్పింది.

అయితే ఇప్పుడు మరకతం పవర్స్ అన్నీ పోయినట్టేనా? అన్నది సహజ సందేహం.

"అవును మరకతం లంజతనం పోయింది. మనల్ని నంజుకు తినే రోజులు పోయాయి" అంది. స్వరాజ్యం అంచనా కరక్టే కోళ్ళదుర్గ కాన్వెంటుకి రావడం మొదలు పెట్టిన దగ్గర్నించి మరకతం ప్రిన్సిపల్ గదిలో కెళ్ళి కూర్చుని ఆదేశాలివ్వడం మానేసింది.

కోళ్ళ దుర్గ వచ్చిన కొత్తలో, మా అందరిలో ఆశలు చిగురించాయి. పరిస్థితి మారుతోంది. మార్పులు వస్తాయి అనుకున్నాం కానీ ఆ మార్పులు కోళ్ళ దుర్గ రావడం ఒక మార్పు. మరకతం రాకపోడం మరో మార్పు అన్నట్టు అక్కడితో ఆగిపోయాయి.

ఈ విషయం అర్థం అయేసరికి ఏడాది గడిచింది. ఇంతకు ముందు జీతం అన్నది చాలు అనుకునే వాళ్ళం, ఇప్పుడు అలా లేదు. ఇది సరిపోదు, వీళ్ళు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు అన్న వ్యథ పట్టుకుంది

కలలు కనడం ఈ పట్టణంలో కష్టం, బతకగలిగితే చాలు, ఏవేవో చెపుతున్నారు. పట్టణం పెరుగుతోందట, ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి.

ఇవేనా అవకాశాలు, ఉద్యోగావకాశాలు పెరగడం లేదు. మోసం చేసే అవకాశాలు పెరుగుతున్నాయి. మోసపోయేవాళ్ళు ఒక వర్గం, మోసగించేవాళ్ళు ఒక వర్గం కాన్వెంటు పేరుతో పిల్లలు, జీతాలు పేరుతో టీచర్లు అందరూ మోసానికే అర్హులన్నట్టుంది.

ఈ చాలీచాలని జీతం, తీరి తీరని అవసరం వల్లా ఇంకా తిట్టాలని పిస్తోంది, ఎంతాలోచించినా మేనేజ్‌మెంటు, ఆలోచన్ని పట్టుకోలేకపోయాం. కోళ్ళ దుర్గ టీచర్లని బలిచ్చుకోడానికి అవతరించిన అమ్మోరిలా ఉంది.

"ఆలస్యం అవకూడదు, బస్సుల్లో ఆటోల్లో, అంతా జనం, వీళ్ళని తప్పించుకోలేం తప్పించుకుంటూ వెళ్ళాలన్న తపన. ఆడదాన్నయి పోయా లేకపోతే ఆటోడ్రైవర్ పక్కన కూర్చుని వెళ్ళేదాన్ని. ఆడదాన్నయిపోయా లేకపోతే బస్సులో వేలాడుతూ వెళ్ళేదాన్ని. ఆటోల్లో కూడా అందరి పక్కా కూర్చోలేం కొందరి పక్క కూర్చో బుద్దేస్తుంది. మరికొందరికంపు భరించలేం.

కోళ్ళ దుర్గ వాగుతుంది. రాత్రి తాగి పగలు ఎనిమిది గంటలనుండి గంతులేస్తుంది. ఆలస్యంగా వచ్చేవుంటుంది.

లేటు రిజిష్టర్ లో రాయమంటుంది మేం మాత్రమే సరిగ్గా ఉండాలి. అదుండదు. రూల్సన్నీ మాకే దాన్నిక్కాదు. కోళ్ళఫారం చెడి కాన్వెంటు పెట్టుకున్నట్టుండదు. మా మీద దయతల్చి కాన్వెంటు పెట్టినట్టుంది. ఏడాదికల్లా జీతం పెరగాలి కానీ అది పెరగదు. పని పెరుగుతోంది. "

స్వరాజ్యం తెగతిడుతోంది. రాత్రి నిద్రపట్టలేదు. పగలు నిద్రపోలేం. కొన్నాళ్ళకి నిద్రమర్చిపోతావేమో?

"నిద్రజ్ఞాపకం ఉండడం మర్చిపోవడమేమిటి?"

"అదంతే మొగుడ్ని మర్చిపోదామనుకున్నా ఏరోజు వాడికి అవసరం పడుతుందో, బి.పి పెరుగుతుందో తెలీదు. పిల్లలు సంసారం అన్నీ ఎప్పుడు విముక్తి."

"అదేమిటి?"

"అవునే సుఖపడుతూ బతికే బతుక్కాదు. మనిది దుఃఖ పడుతూ బతుకు."

"కోళ్ళ దుర్గ సుఖంగా ఉందా? కాన్వెంటు మీద కాసులు రాలడం లేదని దాని దుఃఖం ఎంతొొచ్చినా చాలవు దానికి, ఎప్పుడూ నువ్వు పన్చేయలేదు. వాడు పన్చేయలేదు. అని ఒకటే హింస. ఈ హింస నుండి విముక్తి ఎప్పుడు. ఎప్పుడు దానికి మనం పన్చేస్తున్నట్టు కనిపిస్తాం ఇదింకిలాగే ఉంటుంది. " ఇలాగే అంటే అన్న అనుమానం వచ్చింది.

"ఇలాగే అంటే, నాకు తోచింది చేస్తాను నేను చేసిందే కరెక్ట్ నాకు రూల్సేమిటి? నీకు డబ్బులు పారేస్తున్నాను. నువ్వు నా బానిసవి. నన్నడిగేవాళ్ళా మీరు ప్రభుత్వానికే రూల్సులేవు. నాకేంటి మిమ్మల్ని బుజ్జగిస్తూ కూర్చుంటే నా కాన్వెంటు ఎదగదు. అది గుర్తుంచుకోండి" ఇవీ కోళ్ళ దుర్గ ఆలోచనలు ఆదర్శాలు.

"మీ దిక్కున్న చోట చెప్పుకు చావండి." కొసమెరుపు కోళ్ళ దుర్గ ఆడదవడం లేడీటీచర్లకి మరింత కష్టం కలిగించింది.

కోళ్ళనాయుడుకి లేడీ టీచర్లంటే సాఫ్ట్ కార్నరుండేది. ఇప్పుడది పోయింది.

నగరం పెరుగుతుంది. కాన్వెంటు పెరుగుతుంది. పెరగనిదల్లా మాజీతాలే, బస్సు చార్జీలు పెరిగాయి. లిప్‌స్టిక్ రేట్లూ పెరిగాయి. నిత్యావసర సరుకులు ధరలు పెరిగాయి. లిప్‌స్టిక్ నిత్యావసర వస్తువుల్లో చేరిపోయింది. కాన్వెంటు ఫీజులూ పెరిగాయి కానీ జీతాలు పెరగలేదు. కాన్వెంటు ఇంకా పెరగాలట! దానికి హద్దూ ఆపూ ఎప్పుడో నాలుగంతస్తుల భవనం కట్టడానికి పునాది పడింది. దాన్ని ఎప్పుడు పూర్తిచేస్తారు. ఎప్పుడు జీతాలు పెంచుతారు? జీతం పేరిట ఇంటికి తీసుకెళ్ళిన నాలుగుకాసులూ నాలుగో రోజుకే హరీమంటున్నాయి.

ఈ పరిస్థితిలో ఓ రోజు మరకతం బజార్లో కనిపించింది. స్వరాజ్యం కాన్వెంటు గోడంతా చెప్పుకుంది. కోళ్ళదుర్గ దాష్టీకం చెప్పింది.

కాన్వెంటేమీ బాలేదని చెప్పింది. మరకతానికి కాన్వెంటు సంగతి ఎందుకు, కోళ్ళ దుర్గ సంగతి కావాలిగానీ అక్కడ్నించి కోళ్ళ దుర్గని తప్పించాలి అదీ దాని ఆలోచన. కోళ్ళ దుర్గెంత మంత్రగర్తో.. మరకతం అంత కంత్రీగత్తె.

"దుర్గా క్రుర ప్రిన్సిపల్ హాస్యాలాడుకుంటున్నారట!" అంది. మరకతం డైరక్షన్ ఎటో స్వరాజ్యం పట్టుకోలేకపోయింది కానీ సహజ కర్ధం అయింది.

"పోదాం పదవే " అంది స్వరాజ్యంతో.

అది కదల్లా. అదేకాదు దానితో మరో ఇద్దరు టీచర్లు కదల్లా.

మరకతానికి ఉత్సాహం వచ్చేసింది. "లంచవర్లో తలుపేసుకున్నారా??"

"ఏమో వేసుకుంటున్నట్టే ఉన్నారు" అంది స్వరాజ్యం నవ్వుతూ. స్వరాజ్యానికి తెలీదు మరకతం మాజిక్. "రంకు బొంకు ఆగదు! దుర్గ ఎవరికీ తెలీదనుకుంటుంది. ఎందుకు తెలీదూ నాయుడికి తెలీదు అనారోగ్యం వల్ల ఇల్లు కదలడం లేదు. అంతే! కాసేపాగి మరిన్ని కబుర్లు చెప్పి మరకతం వెళ్ళిపోయింది. అదెళ్ళి పోగానే "స్వరాజ్యం" కంత్రీ ముండ ప్రిన్సిపాల్‌కి దుర్గకి రంకు అంటగట్టేసింది" అంది.

"మరి నువ్వెందుకు విన్నావ్? ఇప్పుడు మరకతం నువ్వే ఈ విషయం తనతో చెప్పావంటుంది"

"అనసీ వచ్చిన నష్టం ఏం లేదు. దుర్గ ఏం చెయ్యగలదు. ఇప్పుడు చేస్తున్నది చాలదా? నా నోటికి జడుస్తుందా సరిలేదా ఉద్యోగం వదిలేయడమే! " మరకతం మనసు. స్వరాజ్యం తక్కువది కాదు, అనిపించింది.

ఈ రంకు కథ ఎంతదూరం పోతుందో

వాళ్ళిద్దరి మధ్యా రంకుందా? మరకతం బొంకిందా? స్వరాజ్యం అగ్గిపెట్టిందా? అన్న ఆలోచన్లు అనవసరం.

ఈ మరకతం కబుర్లలో పడి ఇంటికి లేటయిపోతోంది సహజ.. ఇంట్లో కొడుకేం చేస్తున్నాడో అమ్మ అప్పుడప్పుడు చూస్తుంది. అప్పుడప్పుడు ఒళ్ళు మర్చి నిద్రపోతుంది.

షేర్డ్ ఆటో పట్టుకు ఇంటికి చేరేసరికి తలుపు దగ్గరగా వేసుంది. తలుపు తీయగానే మంచం మీద తల్లి ఇంట్లో కుర్రాడు లేడు. వాడెక్కడికెళ్ళాడు.

లైటేసింది గుడ్డి బల్బు ఇరవై అయిదు వాట్లది, ఎర్రటి వెల్తురు చీకట్ని పారదోలింది. వెలుతురు మాత్రం ఇవ్వదు.

అప్పుడే పరిగెట్టుకొచ్చింది, ఇంటావిడ. బాబు మా ఇంట్లో ఉన్నాడులే అంది.

"........."

"ఏం ఇంతాలస్యం అయింది?"

"పర్మిషను పెట్టి మార్కెట్‌లోకి వెళ్ళాను పిన్నిగారు" అంది సహజ.

"ఎప్పుడు పోయారో తెలీదు మీ అమ్మగారు చాపమీద పడిఉన్నారు. మీ బాబు మంచం ఎక్కి ఆడుకుంటున్నాడు. నాకు తెలిసే సరికే నాలుగైంది. ఇంకో గంటలో ఎలాగూ వస్తావు అని కబురు పెట్టలా. బాబుని తీసుకు మా ఇంట్లో ఉంచా?"

"అమ్మపోయిందా?" ఆశ్చర్యం.

ఆశ్చర్యం దేనికి? ఎప్పుడో అప్పుడు పోవాలికదా పోయింది. ఇంటివాళ్ళ సానుభూతి, తట్టుకోలేని సానుభూతి దేనికి, ఏడుస్తానేమోనని ముందుగా సానుభూతి ఏడుపు రావడం లేదు, ఇంటివాళ్ళు సానుభూతిపర్లు ఏమైనా అనుకోవచ్చు. అనుకోనీ రాని ఏడుపుని ఏడవడం ఎలాగో అర్థం కావడంలేదు.

ఎదురుగా తల్లి ఎముకుల గూడు దవడలు పీక్కుపోయి.

ఎవరిదో స్వాంతన "బాధపడకు తల్లీ ఎప్పుడో ఒకప్పుడు అందరం పోవల్సిన వాళ్ళమే" తను బాధపడుతోందా? తను బాధపడుతున్నట్టు కనిపిస్తోందా? ఎందుకీ నటన. ఆవిడ వచ్చినట్టు నేను గుర్తించాలా. బాధపడ్డం లేదండీ అంటూ అరవాలా ఏడ్చేదాకా ఆగండి అంటూ కసురుకోవాలా? అయోమయం అంతా అయోమయం ఏడవకపోతే ధైర్యస్తురాలు అనుకుంటారేమో. తల్లి చావులో ఏడవకపోతే ధైర్యం అవుతుందా? ఏడిస్తే బేలతనం అవుతుందా?

"సహజ వచ్చిందా?"

"ఆ వచ్చింది."

"ఇంకా దేనికి ఆగడం"

ఇంటావిడ కొడుకు అవును. ఇవాళ చచ్చింది. రేపు లేచి నడుస్తుందా? కాల్చేయాలి. ఎంత తొందరో. తొందరా ఇప్పుడు చేసినా ఒకటే రేపు చేసినా ఒకటే. కానీ పూనుకునేవారు ఎవరు. ఇంటావిడ వచ్చింది. ఏదో చెపుతోంది. ఏం చెయ్యాలి ఇప్పుడు వీలవుతుందా? రేపు చేద్దామా అన్నది తప్ప మాట్లాడుతోంది. నటిస్తోంది. నాకయితే ఎప్పుడేనా ఒకటే బూడిద చేసేవాళ్ళే కావాలి చెయ్యడానికి డబ్బు కావాలి?

"చేతిలో డబ్బు లేదండీ" అంది. ఆవిడకి ఏం అర్థం అయిందో. డబ్బులేకా తాత్కారం చేస్తున్నాననుకుందో ఏమో.

"దాని గురించి నువ్వేం ఆలోచించకు మా అబ్బాయికి తెలిసినవాళ్ళు ఉన్నారు. దహనానికి ఏర్పాట్లు చేసేస్తాడు" అంటూ పరిగెట్టింది ఇంటి ఓనర్.

సహజ డబ్బు లేదంది. ఆవిడ డబ్బు దహనానికే అన్న కంక్లూషన్‌కి వచ్చేసింది.

నిమిషాల మీద ఏర్పాట్లు జరిగాయి. డబ్బుకి సాధ్యపడనిది. ఏముంది శవం యాత్రకి బయలుదేరింది. ఇంటావిడే పనిమనిషిని పెట్టి ఇల్లంతా బాగుచేయించింది.

అయ్యో ఆడపిల్ల ఏం చెయ్యగలదు. అని ఎంతో సాయం డబ్బు ఖర్చు పెట్టినా ఖర్చే చచ్చినా ఖర్చే. పదిరోజులపాటు అంతా నావాళ్ళే స్కూల్లో ఇంట్లో ఎవరు పైవాళ్ళు అందరూ నావాళ్ళే.

శవం దహించబడింది. మనవడి మీద కర్తవ్యం పెట్టి ఎవరో కర్మ చేసారు. డబ్బు ఇచ్చిం దగ్గర తీసుకున్నారు. ఇవ్వలేనిదగ్గరా నే పెడతాలే అంటూ పెట్టారు. ఎంత పెట్టారో తెలీదు. చాలా పెట్టేసుకున్నారు.

ఈ రుణం ఎలా తీరుతుంది. అనిపించారు. ఎలా తీర్చాలో పదకొండో రోజున ఇంటావిడ చెప్పింది.

ఇంటావిడ చెప్పింది విని ఆశ్చర్యపోయింది. ఏమిటి దిక్కు అసలే చాలీచాలని జీతం. పైగా ఇదొకటి ఎలా తట్టుకోడం ఈ విషయం చెప్పడానికేనా ఇంత ప్రేమొలకపోసారు. కాన్వెంటు కెళ్తోందేగానీ మనసు దేనిమీదా నిలవడంలేదు. ఏదో తెలీని కోపం అందరూ కక్షకట్టి తనదారులన్నీ అడ్డగిస్తున్నారు. తనని బతకనివ్వడం లేదు. ఎందుకీ కక్ష ఇంటావిడ మొదట అమ్మా అంటూ నచ్చచెప్పేది.

తల్లిపోయి నెలకావస్తోంది. తల్లిని తనూ మర్చిపోయింది. ఇప్పుడు విసుక్కొంటోంది. ఆ రెండు గదుల ఇల్లు ఆవిడకి కావాలి దానికి ధరుంది. ఆ ఇంటికి అద్దెవస్తుంది. అది తనివ్వలేదు.

ఇంతకుముందు అద్దె వచ్చేదే కాని ఆ అద్దె విలువకి ఏ పనిమనిషి రాదు. ఏ వంటమనిషి రాదు.

తల్లి నమ్మకమైన వంట మనిషి, పనిమనిషిగా పనిచేసింది. తను వృత్తిలోకి వెళ్ళలేదు.

అది ఆవిడకి నచ్చని విషయం అందుకే తనని ఖాళీ చెయ్యమంటోంది. పౌరుష పడితే ఖాళీచెయ్యాలి. కానీ పౌరుషపడే స్తోమత లేదు. ఈ ఇంటినుండి బైటపడితే ఒడ్డున పడ్డ చేపపిల్లే. కొడుకుని తీసుకుని కాన్వెంటు కెళ్ళలేదు.

ఎవరింట్లోనో వదిలి వెళ్ళాలి. సాయంకాలం వరకూ వాడి బతుకంతే. మధ్యలో ఇంటావిడ "ఎప్పుడు ఖాళీ చేస్తావ్ ఇల్లు రిపేరు చేయించుకోవాలి." అంటూ ఒకే సొద.

"అద్దె ఇస్తానండీ" అంటే

వద్దనేస్తోంది. ఎందుకంటే నేనిచ్చే అద్దె ఆవిడకి సరిపోదు. ఆవిడ అడిగే అద్దె సహజ ఇచ్చుకోలేదు.

ఏం చెయ్యాలి? ఎక్కడికి పోవాలి? పరిస్థితి ఇంత విపరీతంగా ఉంటుంది అనుకోలేదు. సహజ ఊరికి దూరంగా కోనా కాన్వెంటు కిలోమీటరు దూరంలో అతి తక్కువకి ఓ రేకుల షెడ్డు అద్దెకి తీసుకుని అక్కడికి మారిపోయింది. అద్దె ఆ రేకుల షెడ్డుకి ఎక్కువే.

రేకుల షెడ్డుకి మారిన రోజునుండీ, పిల్లవాడిని ఎక్కడుంచాలి అనే ఆలోచన, వీడు కాన్వెంటులో వేయడానికి వయసు కురచ అయిపోయింది. వాడి సమస్య అలాగుంటే రోజూ కాన్వెంటుకి నడిచి వెళ్ళి నడిచి రావడం హైరానాగా మారింది.

ఏం చెయ్యాలి కొత్త సమస్యలు ఎలా తీరుతాయి. ఏం చేస్తే తీరతాయి.

బాబుని ఇంటివాళ్ళకి అప్పచెప్తోంది కానీ వచ్చేసరికి వాడు వంటినిండా మట్టి, అప్పుడప్పుడు వొంటాలి పోసిన వాసన డాగులు కట్టిన లాగు. సగం సబ్బు అరిగితే కానీ వాడిని మళ్ళీ బాబుని చేయలేకపోతోంది.

జీవితం విసుగించేస్తోంది. ఏం చెయ్యాలి? ఎలా నెట్టాలి? ఏం చేస్తే కష్టం తీరుతుంది? ఎన్నో ఆలోచన్లు. కానీ తెల్లవారితే ఉరుకులు పరుగులు. ఉరుకులకి పరుగులకి అడ్డుకట్ట పడింది.

స్వరాజ్యం చచ్చిపోయింది. ఎలాఎవరికీ తెలియదు. స్కూలు టీచర్లందరూ వెళ్ళేసరికి దహనం కూడా చేసేసారు. అసలా ఇంటిలో చావు సంకేతాలు కూడా లేవు. వెళ్ళిన వారిని పలకరించేవాళ్ళు కూడాలేరు. ఇంక అక్కడ చేసేదేం లేక అందరూ తిరుగు మొహం పట్టారు. అందరూ టౌనులో కెళ్ళిపోయారు.

ప్రిన్సిపల్ కుర్రాడు, సహజ మిగిలారు.

"స్వరాజ్యంని చంపేసారేమో?" అన్నాడు కుర్ర ప్రిన్స్‌పల్.

"ఎందుకలా అనిపించింది?" అనడిగింది ఆశ్చర్యంగా సహజ.

"ఏమో అలా అనిపించింది?" అంతే" అన్నాడు కుర్రప్రిన్సిపల్.

"................."

"ఇవన్నీ నిర్గంధకుసుమాలు"

"అంటే స్వరాజ్యం, నేనూ రాజీ?"

"కాదు మీరందరూ సమిధలు కాల్చడానికే పనికొస్తారు, ఈ కాన్వెంటులు, కాలేజీలు, ఈ చదువులు వేటిలోనూ గంధం లేదు. అన్నీ ప్లాస్టిక్ పువ్వులే. చదువుకు ఉండవలసిన పరిమళం లేకుండా చేసారు" అన్నాడు.

ఇంతలో సహజ బస్సు వచ్చింది.

"రండి కాఫీ తాగుదురుగాని" అని ఆహ్వానించింది సహజ.

ఒక్క నిమిషం అవాక్కయినా, ఆనందంతో బస్ స్టాపులో చివరిగా సిమెంటు చప్టామీద ముడుచుకు పడుకున్న ముష్టివాడి వేపు పావలా విసిరి, చిర్నవ్వుతో సహజ వెనకే బస్సు ఎక్కేసాడు కుర్ర ప్రిన్సిపల్.

●●●

# గ్లోబల్-లోకల్ కథలు

## - వెల్చేరు చంద్రశేఖర్



***గ్లోకల్ విలేజి అను పంచ మహా పాతక పట్నం.***

*గ్లోబల్ విలేజి అంటే మొత్తం ప్రపంచాన్ని కొత్త కొత్త ఎలక్ట్రానిక్ సంచార సాధనాల ద్వారా దగ్గర చేస్తూ లేదా కలుపుతూ, ఒకదానిమీద ఒకటి లేదా ఒకరి మీద ఒకరు సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆధారపడి బతికే రోజువారీ బతుకుల్నే గ్లోబల్ విలేజర్స్ అని, వారు అలా నివసించాలని శాసించే పరిస్థితులు కల్పించబడిన ప్రతి పట్నాన్ని గ్లోబల్ విలేజ్ అని అనవచ్చు.*

*అయితే గ్లోబల్‌గా ప్రకృతులు వికృతులు ఉన్నై, ప్రకృతుల్లో విలువైన చదువు, వికృతుల్లో అమ్మకానికి చదువు, ప్రకృతుల్లో నైతికంగా డబ్బు వికృతుల్లో "దొనెంబరీ'. ఇలా గ్లోబల్ - లోకల్ కలిసి గ్లోకల్ అవుతుంది. గ్లోబల్ వాల్యూస్‌ని లోకల్‌గా ఆపాదిస్తే అది గ్లోకల్ అవుతుంది అనుకోవచ్చు. అంటే గ్లోబల్‌గా సెక్స్ అత్యవసరవస్తువు అయితే లోకల్‌గా దాన్ని ఇన్‌డీసెంట్‌గా ఎలా ఏర్పాటుచేసుకోవాలి! అవసరం ఎలా తీర్చుకోవాలి. ఈ కొత్త వాల్యూ డెవలప్ అయిన చోటుని గ్లోకల్ విలేజి అనచ్చు, అదన్నమాట! అలాగే ఇంగ్లీషు గ్లోబల్‌గా ఎంత అవసరమో, లోకల్‌గా ఇంగ్లీషు స్కూలు నడిపేవాడికి తెలుస్తుంది. గ్లోబల్ గా రియల్ ఎస్టేటు ఇండస్ట్రీస్ పెరుగుదల కావాలి. కొన్ని దేశాలతో మనం పోటీపడాలి. లోకల్‌గా వాటిని విలువలు పెంచి వాటిని సాధించడానికి మనం ఏ విలువల్ని పణంగా పెడుతున్నాం అన్నది ఒక రూపాయి ప్రశ్నగా కాక, డాలరు ప్రశ్నగా మారి మన బుర్రని తింటోంది. అందుకే ఈ కథలు.*

# కబ్జా

**ఏక్సిడెంటు. ఏదో పెద్దగా** తిరగపడ్డ శబ్దం, దాని వెనకే ఇంజన్ హోరు దాని తర్వాత నిశ్శబ్దం రోడ్డుపక్క హోటల్లో పడుకున్న నాయరుకి నిద్రాభంగం అయింది. హోటల్లోంచి బయటికి వచ్చి చూసాడు.

రోడ్డుకి అవతల పక్కగా ఉన్న ఇంటి దడి పడిపోయింది. ఇల్లు కూలిపోయి లీలగా తెలుస్తోంది. నాయరు నడుచుకుంటూ వెళ్ళి, అక్కడ దృశ్యాన్ని చూసి అవాక్కయిపోయాడు. నేలకూలిన ఇల్లు. ఇంటికి పక్కగా తిరగబడి పోయిన లారీ, పరిస్థితి ఆకళింపుచేసుకునే సరికి నాయరుకి పదినిమిషాలు పట్టింది.

ఇంట్లో ఉన్న ఇద్దరూ చచ్చిపోయుంటారు అనుకున్నాడు. పాక మీద లారీ తిరగబడ్డం వల్ల ముందుకప్పు పైకి లేచి వెదురు కర్రలన్నీ పొడుచుకొచ్చాయి.

వెంటనే నాయరు బుర్ర పనిచేయడం మొదలుపెట్టింది. టైము చూసుకున్నాడు. రాత్రి పన్నెండయింది. ఇంత తొందరగా ఏక్సిడెంట్ విషయం పోలీసులకి తెలీదు అనుకున్నాడు.

హోటలుకి కాస్త దూరంలో ఉన్న బస్‌స్టాప్‌కి వెళ్ళాడు. బస్ స్టాప్‌లో ముష్టి వాళ్ళు పడుకుంటారు. వాళ్ళకొచ్చిన ఆదాయాన్ని నాయరు దగ్గర దాచుకుంటారు.

నాయరు హోటల్లో తింటారు. ఆ విధంగా వాళ్ళకి నాయరుకీ లావాదేవీలు ఉన్నాయి.

బస్‌స్టాప్‌లో పడుకున్న ఇద్దరు ముష్టివాళ్ళని లేపాడు. వాళ్ళు నాయర్ని చూసి ఆశ్చర్యపోయారు. నాయరు వాళ్ళని తనతో రమ్మన్నట్టు సైగచేసాడు. ఇద్దరూ నాయరుతో ఏక్సిడెంట్ జరిగిన ఇంటికి వెళ్ళారు. నాయరు వాళ్ళకి పైకి పొడుచుకొచ్చిన వెదురు బొంగులు చూపించి, వాటిని పీకమన్నాడు.

ఆ ఇద్దరికీ విషయం అర్థమైనా, నాయరుతో ఉన్న అనుబంధం వల్ల వెదురుబొంగులు అటూ ఇటూ మెడ్డించి పీకారు. ఒక్కొక్క వెదురుబొంగూ బైటకి వచ్చేకొద్దీ ఇల్లు మెల్లిగా కూలిపోతోంది. రెండు గంటలయేసరికి నాయరు హోటలుకి చాలా వెదురుబొంగులు చేరుకున్నాయి.

కానీ, తమతోటి ముష్టివాళ్ళు ఎంతకీ రాకపోయేసరికి, ముష్టివాళ్ళందరూ ఆడా, మగా లేచి ఏక్సిడెంట్ సైటుకి చేరుకున్నారు. వాళ్ళని దూరంగా తరిమేద్దామని నాయరు చేసిన ప్రయత్నం ఫలించలేదు.

ముష్టివాళ్ళు ఒక్కొక్కరే ఏక్సిడెంట్ సైటులో చొరబడి తాటాకులు తొలగించి, వాళ్ళకి దొరికిన సిల్వరు గిన్నెలు, బట్టలు పట్టుకుపోయారు. ఇంక తన పరువు దక్కదని, తనకన్న తక్కువ వాళ్ళు తనతో పోటీకి వస్తున్నారని తెలిసి, నాయరు ఏక్సిడెంట్ సైటు నుండి తప్పుకున్నాడు. అప్పటికే అతని హోటల్లో చాలా వెదురుబొంగులు చేరాయి. ముష్టివాళ్ళు కూడా తీసుకెళ్ళగలిగినన్ని తీసుకువెళ్ళారు.

పొద్దున్నకి గాని ఏక్సిడెంటు విషయం పోలీసులు తెలియలేదు, వాళ్ళు వచ్చేసరికి ముష్టివాళ్ళు పట్టుకెళ్ళని తాటికమ్మలు, వాటిని కప్పిన తాటాకు కమ్మలు ఉన్నాయి.

అవన్నీ తొలగించి లోపల మనుషుల్ని బైటకి తీసేరు పాకలో ఉండే ముసిలిదాని మీంచి లారీ వెళ్ళిపోడంతో ముసలిది పడుకున్న చోటే పచ్చడి అయిపోయింది. ఆమె పక్కగా మంచం మీద పడుకున్న ఆమె కొడుకు కాలిమీద తాటి దూలం పడింది. మంచం ఒరిగిపోయి, వాడు పక్కకి దొర్లిపోవడం వల్ల నాభికి పైభాగానికి పెద్దగా దెబ్బతగల్లేదు.

ముసలిదాని కొడుకు ఇంకా బతికేఉన్నాడని తెలియగానే పోలీసులు హాస్పటలికి ఫోను చేసి, అంబులెన్స్ తెప్పించి, స్పృహ లేని స్థితిలో ఉన్న ముసలిదాని కొడుకుని హాస్పటలికి పంపించారు.

రెండోరోజు లారీ ఓనరు విజయవాడ నుండి వచ్చాడు. పోలీసులకి పదివేలు, ముసలిదాని కొడుక్కి రెండువేలూ చేతిలో పెట్టి, పెద్ద గొడవకాకుండా చూసుకున్నాడు.

ఇది జరుగుతున్నప్పుడు ముసల్దాని కొడుకు స్పృహలో లేడు. తాటిదూలం కాలిమీద పడడం కాలు పచ్చడి అయిపోయింది. వెంటనే ఆస్పత్రికి తీసుకురాక పోవడం వల్ల ఎక్యూట్ సెప్టిక్ అయింది. కాలు తీసేయవలసివచ్చింది. కాలు తీసేసిన తర్వాత, దగ్గర దగ్గర నాలుగు నెలలు ఆస్పత్రిలోనే గడపవలసింది. పోలీసులు ఇచ్చిన రెండువేలూ చాలా వరకూ హాస్పటలులోనే ఖర్చు అయిపోయింది. హాస్పటల్లోంచి డిస్చార్జి అయి, చేతికింద కర్రలు పెట్టుకుని, ఇంటికి వచ్చేసరికి, పరిస్థితి వేరుగా ఉంది. ఆ కుంటాడి పేరు రాజు.

●●●

చెయ్యికడుక్కోడానికి బైటకి వచ్చి, కుక్కకోసం చుట్టూ చూసాడు రాజు. గుంటలోంచి చటుక్కున లేచి, ఒళ్ళుదులుపుకుని, తోకాడించుకుంటూ వచ్చింది కుక్క.

''అమ్మా కుక్కకి అన్నం కలపవే'' అంటూ లోపలికెళ్ళాడు. ఆ ఇల్లు చిన్న కమ్మల పాక, అది నేషనల్ హైవేపక్కగా, విశాఖపట్నం టౌనుకి దూరంగా అగనంపూడి గ్రామానికి దగ్గరగా ఉంది. ఆ పాకకి వెనకాల నాలుగువందల గజాల స్థలం ఉంది. ఆ స్థలంలో కూరమొక్కలు, పాదులు వేసి ఉన్నాయి. రాజు తండ్రి పుల్లయ్య ఉద్యోగం వెదుక్కుంటూ విశాఖపట్నం వచ్చాడు.

అగనంపూడి దగ్గర క్రషర్ కూలీలమీద అజమాయిషీ చేసే ఉద్యోగం దొరికింది. పుల్లయ్య విశాఖపట్నం వచ్చేసరికే అతనికి నలభైయేళ్ళు.

ఒంటరిగాడు క్రషర్ పని చేస్తున్న సైటులో పడుకుంటూ, పగలు క్రషర్ పని చేయిస్తూ కాలం గడిపాడు. ఎప్పుడూ సైటులోనే ఉండడం వలన స్టోను చిప్సు తీసుకెళ్ళే లారీలవాళ్ళతోనూ, లారీమీద వచ్చే లేబరుతోనూ, బాగా పరిచయం అయింది. లారీ వాళ్ళతో పరిచయం పెరిగిన కొద్దీ పుల్లయ్య ఆదాయం కూడా పెరిగింది. దాంతో తనమీద తనకి విశ్వాసం పెరిగింది.

ఆ సమయంలో లారీమీద ''స్టోను చిప్సు'' లోడ్ చెయ్యడానికి వచ్చే రాజేశ్వరి మీద మనసయింది. అదికాస్త యజమానికి తెలిసి, ఇద్దరికీ పెళ్ళిచేసేసాడు. అక్కడితో ఆగక ఆ క్రషర్ సైటులోనే ఆఫీసుకి పక్కగా చిన్న పాక వేయించి, ఇద్దరూ కాపరం చెయ్యడానికి ఏర్పాట్లు చేసాడు.

పెళ్ళయే సమయానికి రాజేశ్వరికి పద్దెనిమిదేళ్ళు. పెళ్ళయిన ఏడాదికే రాజేశ్వరి మగపిల్లవాడిని కన్నది. వాడికి రాజు అని పేరు పెట్టుకుంది. రాజుకి పదిహేనేళ్ళు ఉండగా పుల్లయ్యకి క్రషరు ధూళి పడక క్షయరోగం వచ్చింది. రోగం వచ్చిందని తెలిసినా ఉద్యోగం ఊడిపోతుందన్న భయంతో బైటకి చెప్పలేదు పుల్లయ్య.

జబ్బు ముదిరి చావు దగ్గరకి వచ్చాక, రాజేశ్వరిని పిలిచి, తాను సంపాదించిన డబ్బుతో అగనంపూడి గ్రామానికి కాస్త దూరంగా నేషనల్ హైవే పక్కన ఆరువందల గజాల స్థలం రాజేశ్వరి పేర కొన్నానని చెప్పి, దస్తావేజులు రాజేశ్వరి చేతుల్లో పెట్టి కన్నుమూసాడు.

పుల్లయ్య కాలం చేసిన నాలుగైదేళ్ళ వరకూ రాజేశ్వరి క్రషర్ దగ్గర పనిచేస్తూ గడిపేసింది. కూలివల్ల వచ్చిన డబ్బుతో రాజుని చదివించింది. రాజుపడుతూ లేస్తూ ఇరవైనాలుగేళ్ళకల్లా ఇంటర్ అయింది అనిపించాడు.

ఆ సమయంలోనే రాజేశ్వరి ఆరోగ్యం దెబ్బతింది. రాజుని దూరంగా ఉన్న కాంట్రాక్ట్ వర్కులో పెట్టింది, కానీ క్రషర్ దగ్గర పని చెయ్యనివ్వలేదు.

ఆ సమయంలోనే అగనంపూడి దగ్గర స్టీలు ప్లాంట్ కడతారని అక్కడ భూములన్నీ ప్రభుత్వం తీసుకుంటుంది అన్నవార్త! స్టీలు ప్లాంట్ వస్తుందన్న వార్త వినగానే, ఆ చుట్టుపక్కల స్థలాలున్న వాళ్ళకి ఎలాగైతే భయం వేసిందో అలాగే ఏమీలేని చిన్న చిన్న వ్యాపారస్తులకి ఆనందం కూడా కలిగింది.

చిన్న చిన్న వ్యాపారస్తులు నేషనల్ హైవే పక్కన, స్టీల్ ప్లాంట్ వస్తుందన్నదానికి దగ్గరగా చిన్న హోటల్సు, కిళ్ళీబడ్డీలు, వగైరా వగైరా పెట్టేరు. వీళ్ళ అనాథరైజ్డ్ ఆక్యుపేషన్‌కి జడిసిన రాజేశ్వరి, రాజు తమస్థలంలో చిన్న పాకవేసుకుని, వీధి దూళి ఇంట్లోకి రాకుండా ఇంటిముందు దడిలా కట్టుకున్నారు.

స్థలాలు తీసుకుంటామన్న ప్రభుత్వం రంగంలోకి దూకి, స్థలాల వోనర్స్ అందరికీ నోటీసులిచ్చింది.

రాజు పనిచేస్తున్న కాంట్రాక్టరు దగ్గర పని పూర్తయిపోయింది. ''రాజూ రేపురా నీకు రావలసింది. లెక్కకట్టి ఇచ్చేస్తాను'' అన్నాడు కంట్రాక్టరు.

'ఆ విషయమే తల్లితో చెప్పాడు రాజు. కలియపెడుతున్న కూరని ఆపి "అలా అయితే ఎలాగరా ఫ్యాక్టరీ అయిదేళ్ళు వెనక్కి పోయింది అంటున్నారు. ఒకవేళ ఫేక్టరీ పెట్టినా మనస్థలం తీసకున్న వెంటనే ఇదిగో నీకు ఫేక్టరీలో ఉద్యోగం అని ఇవ్వరు. అదీగాక ఇంతవరకూ ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బుకి, లెక్కతేలడం లేదు. ప్రస్తుతం ఇక్కడ మెంబర్ ఆఫ్ పార్లమెంటు ప్రతిపక్షం వాడాయె, ఇవేవీ తొందరగా జరిగే పనులుకావు" అన్నాడు రాజు.

రాజు చెప్పిన లాజిక్ తల్లికి అర్థం అయిందో లేదో, తెలియదు గాని రాజు వేపు సాలోచనగా చూసి, పొయ్యివేపు తిరిగి, పొయ్యిలో కర్ర ఎగదోసింది. ఆమె మనసు పొయ్యిలా కాలుతోంది అసహనంతో!

రాజు నులక మంచం వాల్చుకు కూర్చున్నాడు. కాసేపు తల్లివేపు చూసాడు. తల్లి ఏమీ మాట్లాడక పోవడంతో, మంచం మీద వెల్లికితలా పడుకుని ఇంటి పైకప్పుని చూసాడు. గదిలో కిరసనాయిలు దీపం చేస్తున్న నాట్యానికి, ఇంటి కప్పుమీద నీడలు మత్తుగా, ఆనందంగా తలలూపుతున్నాయి. ఆ వెలుగు నీడల దోబూచులాటలో తాటికమ్మలు భయం గొల్పేలా ఉన్నాయి.

కొడుకు దిగులు చూసి, తల్లికి బాధ కలిగింది. ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని "ఇంటిముందు కిల్లీ షాపు పెడితే పోదురా" అంది.

"ఎలా పెట్టడం లేండ్ ఎక్విజిషనువాళ్ళు వచ్చి అల్లరి చేస్తారే మనల్ని పొకేసినందుకే కోప్పడుతున్నారు" అన్నాడు.

"మరి నాయరు టీ దుకాణం పెట్టలేదా" తల్లిలాజిక్..

"వాడు వాళ్ళకి డబ్బు ముట్టచెప్పాడు, మన దగ్గర ఏదేనా మొదలు పెట్టడానికే మదుపులేదు. ఇంక వాళ్ళకేమిస్తాం" అన్నాడు.

రాజు నిరాశావాదం ఆమెకి నచ్చలేదు. ఇంకేదో చెప్పబోయింది. అది గమనించిన రాజు "ఊ సర్లే ఆకలేస్తోంది. అన్నం పెట్టు" అన్నాడు.

నువ్వు చెయ్యి కడుక్కుని చాలాసేపయింది. ఇంకా భోజనం చెయ్యలేదా? అన్నట్టు కుక్క లోపలికి తొంగి చూసింది.

"ఒరేయ్ కుక్కని తగులు లోపలికి వచ్చేస్తోంది" అని అరిచింది తల్లి.

రాజు "ఛీ" అనకుండానే కుక్క వెళ్ళిపోయింది. రాజు ఆలోచన కుక్కమీదకి పోయింది. పుట్టినప్పటినుండి ఎలా బతుకుతానా? అన్న ఆలోచన రాదు కాబోలు ఛీ కొడితే పోతుంది. కోపం తెచ్చుకోదు. భోజనం సమయానికి గుమ్మంలో హాజరవుతుంది.

దీనికి చూపు తక్కువ. కానీ విషనరీ! దీని విషన్ అంతా దీని ముక్కులో ఉంది ప్రస్తుతం రాజకీయనాయకుల విషన్ అంతా డబ్బు మీదే. దీనికి కాస్త కలర్ బ్లైండ్ అంటారు. మన రాజకీయనాయకులకు కాసు వాసన తప్ప జనం కనిపించరు.

"వడ్డించేను రారా" అన్న పిలుపుతో రాజు ఆలోచన తెగింది. రాజు భోజనం చేస్తుంటే తల్లి మొదలుపెట్టింది.

"ఏదీ చెయ్యకపోతే ఇల్లు గడిచేదెలాగరా? నీకు ఉద్యోగం లేదు. ఈ స్థలం మీద డబ్బు, ఫాక్టరీ ఉద్యోగం రెండూ కనుచూపు మేరలో లేవు. అసలు ఏ వైషయమేనా తెలుసుకోవాలి అంటే ఆ ఆఫీసు చుట్టూ నాలుగుసార్లు తిరగాలి" అంటు బాధంతా వెళ్ళగక్కింది.

రాజు "అలాగేలే" అన్నట్టు బుర్రూపాడు. రాజు తినడం అయ్యాక తనుకూడా తిన్నాననిపించి, మధ్యాహ్నపు పొడన్నం కొంత చారుతో కలిపి, తీసుకొచ్చి కుక్కకి వేసింది రాజేశ్వరి. ఇంతకు ముందు వరకూ గసిరిన గసుర్లు, కొట్టిన "ఛీ"లు మరిచి రాజకీయనాయకుడు ఓటు కోసం వచ్చినట్టు, తోకాడించుకుంటూ వచ్చి, పెట్టింది తిని, "ఈ రోజు గడిచింది" అన్నట్టుగా మళ్ళీ దాలిగుంట దగ్గరకి వెళ్ళి ప్రదక్షణం చేసి పడుకుంది కుక్క.

●●●

దూరమా ఊరు విటుడు నలిపేసిన జాణ అలసి నిద్రలోకి జారుకుంది. అప్పుడో లారీ, అప్పుడో బస్సు రోడ్డు మీద పెద్ద శబ్దాలు చేస్తూ వెళుతున్నాయి. రాజుకి నిద్రపట్టలేదు. పక్కమీద అటూఇటూ దొర్లాడు. నిద్రపోడానికి ప్రయత్నించాడు. నిద్రరావడం లేదు.

ఆలోచనలు వస్తున్నాయి. అమ్మ చెప్పిన పనులు చెయ్యాలి. ఈసారి ఎక్విజిషన్ ఆఫీసుకెళ్ళి, విషయం తెలుసుకోవాలి. ఇంటి వెనక స్థలంలో పాదులు ఎండిపోయాయి. వాటిని శుభ్రం చేసి, కొత్త పాదులు వేయాలి రేపటినుండి పనులన్నీ తొందరగా చకచకా చేసేయాలి అనుకున్నాడు. పక్కకి తిరిగి రెండు చేతులూ తొడలమధ్య పెట్టుకుని, ముణగతీసుకుని పడుకున్నాడు. వీధిలో ఊరకుక్క ఆకాశం వేపు మొరఎత్తి కేర్ కేర్ మంటూ ఏడుస్తోంది. రాజు ఆలోచనలు మళ్ళీ కుక్కమీదకి పోయాయి. రాత్రుళ్ళు కుక్కలకి దెయ్యాలు కనబడతాయట! అందుకే కేరుస్తాయి అంటుంది అమ్మ. కుక్క దెయ్యాల్ని ప్రత్యక్షంగా చూస్తోంది. కాబట్టే మనిషి అంటే విశ్వాసం చూపిస్తాయి. కుక్క ఈ ఇంటికి అలవాటు పడిపోయింది. ఇక్కడే ఉంటోంది. రాత్రుళ్ళు అరుస్తుంది. ఏడుస్తుంది. నిద్రపోనివ్వడంలేదు. కుక్కని తగిలెయ్యాలి అనుకున్నాడు. గట్టిగా కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

రోడ్డు మీద పెద్ద శబ్దం చేసుకుంటూ లారీ వెళ్ళింది. కుక్క గట్టిగా చావుదెబ్బ తిన్నదానిలా భయంకరంగా అరచింది. ఇంకా అరుస్తూనే ఉంది. కుక్క అరుపు రాజు మనసుని అప్పుడప్పుడు విసుక్కున్నా కుక్క కేరుపంటే రాజుకి చాలా ఇష్టం.

కుక్క అరుపు బానిస జాతియావత్తు గొంతెత్తి దీనంగా ఒకేసారి అరచినట్టు ఉంటుంది. జానెడు పొట్టకి అందరూ బానిసలు. ఈ ప్రపంచంలో అంతా బానిసలే సిద్ధాంతానికి, తుపాకులకి, పెళ్ళాలకి, మొగుళ్ళకి, డబ్బుకి, డాబుకి, మందుకి అందరూ ఏదో ఒక దానికి బానిసలు . మనం బానిసలుగా పుట్టాం బానిసలుగా పెరిగాం, బానిసలుగా చస్తాం. పుట్టగానే ఆక్సిజనుకి బానిస, దొరక్కపోతే చస్తాం మరి. పెరిగాక పేరుకి బానిస, ఆ పేరే పెట్టి పిలవాలి. ఆ పేరే మనకి తోడు నీడ. ఆ పేరులో కేష్టుంటే అదే మనకి బాసట. అవసరాలు పడగానే డబ్బుకి బానిస. డబ్బుకి తీరని అవసరం అంటూ ఏదీ లేదు. అన్నింటికి మించి ఎప్పుడు ఏ అవసరం వస్తుందేమోనని అధికంగా డబ్బు గణించాలి. అందుకే అవసరానికి మించి డబ్బు. దాన్నికిట్టనివాళ్ళు డబ్బు పిచ్చి అంటారు. పిచ్చి భయం. పిచ్చి నమ్మకం. పిచ్చి భక్తి. పెళ్ళాం పిచ్చి ఆ పిచ్చి ఈ పిచ్చి అని అనేక పిచ్చులున్నాయి కానీ డబ్బుకి ముందు కానీ వెనగ్గాకానీ పిచ్చి తగిలించిన పిచ్చివాళ్ళు తక్కువ. అసలు లేరు.

రాజుకో విచిత్రమైన కోరిక ఉంది. ఎప్పుడైనా అర్ధరాత్రి నల్లటి తారురోడ్డు మీద ముడుచుకు పడుకుని ఆకాశంలో నక్షత్రాలని చూస్తూ భోరున ఏడవాలని ఉంది. కానీ ఆ పని చేయడానికి అతనికి నాగరికత అడ్డుస్తోంది. కడుపులో చల్ల కదలనంతవరకూ ఈ నాగరికతకు సంస్కృతికి తను బానిసే.

కుక్క ఇంకా ఏడుస్తూనే ఉంది. ఇప్పుడు దాని స్వరం హీనంగా ఉంది. నిద్రాభంగం చేసేంతగాలేదు. నిద్రేరావడం లేదు మంచానికి పక్కగా చాపమీద నిద్రపోతోంది తల్లి. చెడిపోయిన మిక్సర్ లా గురకపెడుతోంది.

ఎక్కడో కోడి ''కొక్కొరోకో'' అంటూ అరిచింది. కుక్క దీనాలాపన ఆగిపోయింది ఎదురుగా నాయరు కొట్లో ఇడ్లీ పిండి రుబ్బుతున్న చప్పుడు వినబడుతోంది. రాజు మగతలోకి జారుకున్నాడు.

●●●

మర్నాడు రాజు నిద్రలేచేసరికి ఎనిమిది అయింది. నోట్లో పందుం పుల్ల పెట్టుకుని బైటకి వచ్చాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. రాత్రి కుక్క చేసిన దీనాలాపన. కుక్కకోసం చుట్టూ చూసాడు. నాయరు హోటలుకి కొంచెం దూరంగా రోడ్డుమీద కుక్క శాశ్వతంగా నిద్రపోతోంది. కుక్కపొట్టమీంచి లారీ వెళ్ళిపోయినట్టుంది. పొట్టలో ప్రేవులు బైటకి వచ్చాయి. రేపటికల్లా మరికొన్ని లారీలు ఆ కుక్క శవం మీంచి వెళ్ళిపోతాయి. దాని శరీరం నామరూపాలు లేకుండా రోడ్డుకి అంటుకుపోతుంది. కుక్క చావు రాజుని కదిలించింది. విశ్వాసం దాని స్వభావికం, బద్ధకం మనిషి స్వభావికం.

లేండ్ అక్విజిషను ఆఫీసుకి వెళ్ళినా వొరిగేదేమీ లేదు. అమ్మకి వెళ్ళానని చెపితేచాలు. కూరపాదులు తర్వాత ఇంకో రోజు వేయవచ్చు, సైటు దగ్గరకి వెళితే కంట్రాక్టరు మిగిలిన డబ్బు ఇస్తాడేమో! అది తీసుకుని గాజువాకలో సినిమాకి వెళ్ళాలి, మళ్ళీ సినిమా

ఎత్తేస్తాడు. మిగతా పనులన్నీ రేపైనా చెయ్యచ్చు కాని సినిమా ఎత్తేస్తే మళ్ళీ చూడడం పడదు అనుకుని, తయారై చద్దన్నం తిని, కంట్రాక్టరు దగ్గరకి బయలుదేరాడు రాజు.

●●●

ఏక్సిడెంటు అయిన నాలుగు నెలల తర్వాత ఇంటికి వచ్చిన రాజుకి, ఎదురుగా తన స్థలంలో స్టీలు కమ్మలు, దూలాలు కనిపించాయి. అవి తన స్థలంలో ఎందుకున్నాయో తెలియలేదు. నాయరు హోటలు ముందు పెద్ద పందిరి పడింది. ఆ పందిరిలో తాటికమ్మలతో చేసిన బెంచీలు ఉన్నాయి.

కుంటుకుంటూ వెళ్ళి నాయరు హోటల్లో, పందిరికింద తాటికమ్మల బెంచీ మీద కూర్చున్నాడు. హోటల్లోంచి నాయరొచ్చి, నీకు చాలా అన్యాయం జరిగిపోయింది రాజూ అంటూ బాధపడ్డాడు. ఏక్సిడెంట్ అయిన తర్వాత వచ్చిన పోలీసులు రాజుని హాస్పటలుకి పంపించి, అతని తల్లికి దహన సంస్కారాలు చేసారని, నాలుగైదు రోజులు ఆ స్థలానికి కాపలా ఉండి తర్వాత స్థలం నుండి తప్పుకున్నారని చెప్పాడు. రాజుకి 'టీ' ఇచ్చి, తన పొరుగు బాధ్యతనుండి విముక్తుడయాడు.

రాజు టీ తాగి, తన కర్రల సాయంగా కుంటుకుంటూ పోలీసు స్టేషనుకి వెళ్ళాడు.

పోలీసు స్టేషనులో రాజుని గుర్తుపట్టిన వాళ్ళేలేరు. అసలు పోలీసులకి జరిగిన ఏక్సిడెంటే జ్ఞాపకం లేదు. ఎన్నో విషయాలు గుర్తుచేసి, కంటతడి పెట్టగా అప్పుడు గుర్తుకొచ్చింది వాళ్ళకి. అక్కడ లారీ ఏక్సిడెంట్ అయిందని, ఏక్సిడెంట్ అయితే అయిందని గుర్తుకొచ్చింది కాని, ఆ స్థలం నుండి, ఏదైనా వస్తువులు గాని, మరేవైనా రాజుకి సంబంధించినవి తీసి దాచేమా? అన్న విషయం జ్ఞాపకం రాలేదు. స్టేషనులో ఉన్న అందరినీ ఎంక్వైరీ చేయగా, వాళ్ళు ఏవీ తీసి దాచలేదని, అసలు తీసి దాచడానికి అక్కడ ఏమీలేవని, తెలిసింది.

రాజుకి ఏం చెయ్యాలో అర్థం కాలేదు. మళ్ళీ నాయరు కొట్టుకి వచ్చి తన స్థలంలో దూలాలు కమ్మలు ఎవరివి అంటూ ఆరా తీసాడు.

నాకు తెలీదు రాజూ అన్న నాయరు సమాధానానికి రాజు తట్టుకోలేకపోయాడు. ఇది నా స్థలం దీన్ని ఎవడో ఆక్రమించుకున్నాడు అన్న తపన పట్టుకుంది.

ఎవర్నేనా అడుగుదాం అంటే అక్కడ ఎవరూలేరు? ఏం చెయ్యడానికీ తోచలేదు రాజుకి, ఈ ఇనప దూలాలూ కమ్మలూ స్థలంలోంచి బయటపారేద్దామంటే, అది తన శక్తికి మించిన పని. ఏం చెయ్యాలో తోచలేదు రాజుకి, వెళ్ళి తన స్థలంలో కూర్చున్నాడు. ఎవ్వరూ పొమ్మనలేదు. అయినా తృప్తిగా లేదు. రోజంతా చూసాడు. ఎవరూ రాలేదు ఆ దూలాలు కమ్మలూ పట్టుకుపోలేదు.

స్థలం ఖాళీగా ఉందని పెట్టుకున్నారేమో! తర్వాత పట్టుకుపోతారేమో అనుకున్నాడు. నాయరుగానీ ఆ చుట్టుపక్కలవాళ్ళుగానీ ఏం చెప్పలేకపోతున్నారు.

కానీ సాయంకాలం నాయరు కొట్లో పనిచేసే కుర్రాడు రాజుకి రహస్యంగా, నీ స్థలంలో కర్రలకొట్టు పెడుతున్నారు. వాడూ కేరళవాడే, వాడ్ని నాయరే పిలిపించాడు అన్చెప్పాడు. నాయరాడుతున్న నాటకం అర్థమయింది రాజుకి, కానీ ఏం చెయ్యలేడు.

రాజుకేం చేయాలో తోచలేదు. లేండ్ ఎక్విజిషను ఆఫీసుకి వెళ్ళి స్థలం ఎక్విజిషనులోకి వస్తుందో రాదో కనుక్కుంటే, ఆ లేండ్‌లో చిన్న పాకో మరేదో వేసుకోడానికి ప్రయత్నించవచ్చు, అనే ఆలోచనతో లేండ్ ఎక్విజిషను ఆఫీసుకి వెళ్ళాడు.

లేండ్ ఎక్విజిషన్ ఆఫీసులో క్లర్కు రాజుతో మాట్లాడేసరికి చాలా సమయం పట్టింది.

రాజు అడిగిన వివరాలేవీ, ఆ క్లర్కుకి అర్థంకాలేదు. ఆఖర్ని ఏదైతే అడగకూడదో అదే ప్రశ్న వేసాడు క్లర్కు. అప్పుడు రాజు ఏ విషయం చెప్పకూడదో, అది పూర్తిగా క్లర్కుకి అర్థం అయేటట్టు చెప్పాడు. తన సైటులో లారీ ఏక్సిడెంటు జరిగిందని, తల్లి

చచ్చిపోయిందని, తనని స్పృహలేని స్థితిలో హాస్పటలులో జాయిన్ చేసారని, ఇంట్లో సామానులు ఇంటికి సంబంధించిన కాగితాలూ అన్నీ మొత్తంగా కనబడకుండా పోయాయని" చెప్పాడు.

క్లర్కు హృదయం జరిగిన విషయాన్ని ఆకళింపు చేసుకుని నిమిషం పాటు జాలిపడినా, పేపర్లు లేకుండా వచ్చి తనని సతాయిస్తున్న రాజుని చూసి చికాకుపడ్డాడు.

"అయితే కాగితాలు ఏవీమిగల్లేదా?" అన్నాడు సాలోచనగా.

"లేవు" అంటూ దీనంగా మొహం పెట్టాడు రాజు.

"పేపర్లు లేకపోతే మేమేమీ చెయ్యలేము" అంటూ పక్కవాడు పిలుస్తుంటే 'టీ' తాగడానికి వెళ్ళిపోయాడు.

ఆఫీసులో క్లర్కులు అందరూ కోరస్‌గా పేపర్లు లేకపోతే తాము ఏమీ చేయలేమని నిక్కచ్చిగా చెప్పేసారు. ఈ కోరస్‌లో అపస్వరం అన్నట్టుగా ఆఫీసు బంట్రోతు "అయ్యగారితో చెప్పు" అంటూ సలహా పారేసాడు.

సలహాలో చిన్న ఆశ కనిపించి, అయ్యగారి గురించి వాకబు చేస్తే "లంచ్‌కి వెళ్ళారు. మళ్ళీ నాలుగు గంటలకి వస్తారు." అని తెలిసిద్కి.

అప్పటికి రాజుకి ఆకలివేసి నీరసం వచ్చింది. జేబులో డబ్బులు చూసుకున్నాడు. నలభై రూపాయలున్నాయి. లేండు ఎక్విజిషను ఆఫీసునుండి బైటకి వచ్చి, ఎదురుగా ఉన్న హోటలులో భోజనం చేసి, ఆఫీసుకి ఎదురుగా ఉన్న బస్ షాపు నీడని ఆశ్రయించాడు.

మధ్యాహ్నం అవడం వల్ల బస్‌షాపు నిర్మానుష్యంగా ఉంది.

తన దీనస్థితికి తనే జాలిపడ్డాడు రాజు. ఆఫీసరు ఏమంటాడు? ఇప్పుడు స్థలానికి సంబంధించిన కాగితాలు ఎక్కడ దొరుకుతాయి? తానెక్కడుండాలి? ఈ కుంటి కాలితో జీవితం ఎలా? ఎన్నో ఆలోచనలు వేటికీ సమాధానం లేదు.

కాగితాలు ఉన్నా లేకపోయినా, స్థలంలో చిన్న పాకవేయాలి, దానికి డబ్బు కావాలి? ఎవరిస్తారు? నాయరిస్తాడా? నాయరు చస్తే ఇవ్వడు నాయరు హోటలే అంతంత. క్రషరు వోనరు గార్ని అడిగితే, తన తండ్రి క్రషరు పనిలో అక్రమంగా డబ్బు సంపాదించి ఈ స్థలం కొన్నాడని, కోపంగా ఉన్నాడు. కాబట్టి తన ఈ పరిస్థితి చూసి సంతోషిస్తాడు గాని పైసా సాయం చెయ్యడు.

నాలుగు గంటలకి వస్తాడన్న ఆఫీసరు, అయిదు గంటలకి వచ్చాడు. తన పనంతా చూసుకున్న తర్వాత, రాజుని పిలిచాడు. విషయం అంతా ఓపిగ్గా విన్నాడు. టేబులు మీద బెల్లు మోగించి ఎవర్నో తీసుకురమ్మన్నాడు. ఆఫీసులో ఆఫీసరొక్కడే ఉన్నాడని మిగతా ఆఫీస్మతా అయిదుగంటలకే వెళ్ళిపోయారని బంట్రోతు చెప్పిన సమాధానానికి నొచ్చుకుని రాజుతో "రేపు రా నేను చేయగలిగినంత సహాయం చేస్తా"నన్నాడు.

రాజుకి సంతోషం వేసింది. వినయంగా 'అలాగేనండి' అంటూ ఆఫీసరుకి నమస్కరించాడు.

రోజంతా తిరిగినా నిరాశే నిస్పృహ! ఆఫీసరు సమాధానంతో కొంత ఊరట కలిగింది. ఆశ చిగురించింది. రేపటితో కొన్ని కష్టాలు తీరవచ్చు. ఆఫీసరు ఆఫీసు ఫైల్స్‌లో తన కాగితాలు వెదికితే దొరకొచ్చు, ఫేక్టరీ రావడం లేటయినా, తన స్థలం తన దగ్గరే ఉంది. అని తెలిస్తే అదో తృప్తి విశ్వాసం కలుగుతాయి అన్న ఆలోచనలతో ఆఫీసునుండి బైటకి వచ్చాడు.

అప్పటికి సాయంత్రం ఆరయింది. రోడ్డంతా ట్రాఫిక్‌తో రద్దీగా ఉంది. రాజు మనసు విశ్వాసంతో ఉత్సాహంగా ఉన్నా, రేపు ఆఫీసరు తీయించిన కాగితాల వల్ల ఆ స్థలం తనది అన్న విషయం తేలి, లేండ్ ఎక్విజిషను ఆఫీసరు, లాండ్ తీసుకునే వరకూ తనని అందులో నివసించమన్నా, అక్కడ పాకవేయడానికి తన రోజులు గడవడానికి డబ్బెవరిస్తారు? ఈ కుంటికాలితో జీవితం ఎలా నెట్టుకు రావడం. ఈ ఆలోచనలవల్ల సమస్యలు తీరవని తెలిసినా, అతని బుర్రలో ఆలోచనలు రోడ్డుమీద ట్రాఫిక్ రద్దీలా చికాకు కలిగిస్తున్నాయి.

ఎదురుగుండా టీ కొట్టులో టీ తాగాడు. రోడ్డు పక్కన బస్‌స్టాపు దగ్గర చాలాసేపు నిలబడీ వచ్చేపోయే జనాన్ని చూసాడు. రాత్రి ఏడయేసరికి మనుషుల మొహాల్లో ఆతృతని గమనించాడు. అందరూ ఎవరింటికి వాళ్ళు వెళ్ళాలనే తపన, తమ మొహాల్లో, చేతల్లో చేష్టల్లో చూపిస్తున్నారు. పిల్లలు బస్సుఎక్కారా? లేదా? అని ఆతృతపడే తల్లి తండ్రులు, పెళ్ళాన్ని ఆడవాళ్ళ డోరునుండి జాగ్రత్తగా బస్సు ఎక్కించి, వెనక్కి వచ్చి వెనక డోరు దగ్గర వేలాడే పడుచు జంట అతి జాగ్రత్తని, లోపల సీటు దొరక్కపోతే, ప్రయాణం చేస్తున్నంతసేపూ నిలబడవలసివస్తుందనే ఆలోచనతో గాభరా పడే తాతగారిని, ఈ రద్దీలో నేనూ ఉన్నాననే, విశ్వాసంతో బస్సు ఎక్కుదామని ప్రయత్నించి, ప్రజల సహకారం లభించక వెనక్కి తప్పుకునే గుడ్డివాడిని, నత్తకాయల్లా వీపుమీద పుస్తకాల మూటలతో గాబరాగా బస్సు ఎక్కుదామనుకునే పిల్లలు, వీళ్ళందరూ ఎక్కడ తప్పించుకు పోతారో అన్న ఆదుర్దాతో ఎదుటి వాళ్ళ గాభరాని పట్టించుకోకుండా, వాళ్ళ కాళ్ళకి అడ్డుపడుతూ అడుక్కుంటున్నాడు ముష్టివాడు. అంతా గాబరాగా ఉంది సాయంత్రపు విశాఖ.

రాత్రి తొమ్మిదిగంటలకి, ఎదురుగుండా కనిపిస్తున్న జనం పలచపడ్డారు. రద్దీ తగ్గింది. ఇప్పుడు బస్సులు కాళీగా వెళ్ళిపోతున్నాయి. అప్పుడో మనిషి అక్కడో మనిషి వచ్చి బస్సు ఎక్కుతున్నారు. ఎదురుగుండా ఉన్న రద్దీ తగ్గి ప్రశాంతత ఏర్పడేసరికి, రాజుకి కూడా ఏదో విశ్రాంతి చిక్కినట్టయింది. ఆకలేయడం మొదలు పెట్టింది. పక్కనున్న హోటల్లో భోజనం చేసాడు. భోజనం చేసాక రేపటివరకు ఎక్కడుండాలి? అన్న సమస్య, నాయరు కొట్టు దగ్గరకి వెళ్ళి అవుతుంది. అంతేకాక పొద్దున్న నాయరు ప్రవర్తించిన తీరును బట్టి చూస్తే అక్కడకి వెళ్ళకపోవడమే మంచిది.

ఇప్పుడు అక్కడికి వెళ్ళి రేపు అక్కడ నుండి వచ్చేసరికి ఆరురూపాయలు ఖర్చు అవుతాయి. మిగిలిన పదిహేనురూపాయల్లో ఆరుపోతే తొమ్మిది ఉంటాయి. దాంతో రేపల్లా గడవాలి?

అలా కాకుండా రేపు ఆఫీసర్ని కలిసి ఏ విషయం తెలుసుకుని ఏకంగా నాయరు కొట్టుకెళ్ళి కప్పులు కడుగుతాను. అందాకా నీ హోటల్లో ఉంచుకో అంటే ఉంచుకుంటాడేమో.. ఆ తర్వాత పాక వేసుకునే ఆలోచన చేయవచ్చు. ఇన్ని ఆలోచనలతో సతమతమైన రాజుకి తన సమస్య మళ్ళీ మొదటి కొచ్చింది అనిపించింది.

ఈ రాత్రి ఎక్కడ గడపడం? సమస్యలకి సమాధానం అన్నట్టుగా ఎదురుగా నిర్మానుష్యంగా ఉన్న బస్‌స్టాపు కనిపించింది. అప్పటికి రోడ్డు మీద జన సంచారం తగ్గింది. బస్సులు కూడా ఏ అరగంటకో ఒకటి అన్నట్టుగా వస్తున్నాయి.

రాజు కుంటుకుంటూ బస్ స్టాపులోకి వెళ్ళి ఒకమూల శుభ్రం చేసి క్రరలు పక్కన పెట్టి సిమెంటు గచ్చుమీద కూర్చున్నాడు. రోజంతా తిరిగి అలసి ఉన్నాడేమో, కూర్చోగానే సేదతీరినట్టయింది. ఆలోచనలు రావడం మానేసి నిద్రొచ్చేసింది. శుభ్రం చేసుకున్న గచ్చుమీదే ఓమూలకి ఒదిగిపడుకున్నాడు. అలసిన రాజు సొలసి నిద్రపోయాడు.

●●●

తెల్లవారిన వెలుగుకి తెలివొచ్చింది రాజుకి. ఉలిక్కిపడి లేచిన రాజుకి, తన పక్కనే పడుకున్న ఇద్దరు బిచ్చగాళ్ళు కనిపించారు. షాక్ తగిలినట్టయి, లేచి నిలుచున్నాడు. ఎదురుగా ఉన్న హోటలులోకి వెళ్ళి బేసిను దగ్గర మొహం కడుక్కున్నాననిపించాడు. కాఫీ తాగాడు. హోటలు నుండి బయటికి వచ్చిన రాజుకి మళ్ళీ బస్‌స్టాపుకి వెళ్ళబుద్దివెయ్యలేదు. ఆ కొట్టు దగ్గర, ఈ కొట్టు దగ్గర తచ్చాడాడు. ఎనిమిది గంటలవుతుందనగా, ఆఫీసుకెళ్ళాడు. అప్పటికి ఆఫీసు తెరవలేదు. ఆఫీసు బయట అరుగుమీద కూర్చున్నాడు. ఆఫీసు ఎన్ని గంటలకి తెరుస్తారు? ఆఫీసరు ఎన్ని గంటలకి వస్తాడు? వచ్చాక రికార్డు చూసి తన స్థలం ఎక్విజిషనులోకి వస్తుందంటాడా, రాదంటాడా, వస్తే ఎన్నాళ్ళలో కాంపన్సేషను ఇస్తారు. స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం ఇస్తారా? ఇసే ఎన్నాళ్ళలో ఇస్తారు? ఇవన్నీ ప్రశ్నలు.

రాజు ఎదురు చూసిన టైము పది అయింది. ఆఫీసు తెరిచారు. ఒకొక్కరే ఆఫీసుకి వస్తున్నారు. వచ్చిన వాళ్ళు టేబుళ్ళు దులిపి కుర్చీ దులిపి కూర్చుని పక్కవాడితో కబుర్లు చెప్పి, వాళ్ళు కూడా 'ఊ' అంటే హోటల్లో కాఫీ తాగడానికి వెళ్ళిపోతున్నారు.

రోడ్డుమీద బస్సులు, జనం, మళ్ళీ రద్దీ పెరిగింది. పదకొండు గంటల వరకూ ఎదురు చూసిన రాజు, కుంటుకుంటూ ఆఫీసులోకి వెళ్ళి నిన్న తనని ఆఫీసరు దగ్గరకి పంపించిన ప్యూనుని కలిసి వో దండం పెట్టాడు. ఆ ప్యూను ఏమిటి? అన్నట్టు చూసాడు. రాజు ఆఫీసరు గురించి అడిగాడు. "అబ్బే.. ఆయన ఇవాళ రాడు కేంపెళ్ళారు" అని చెప్పాడు ప్యూను. ఆ సమాచారానికి రాజు హతాసుడైపోయాడు. ఏం చెయ్యాలో తెలియ. అనుమానంగా "నన్నీవాళ రమ్మన్నారు"? అని ప్రశ్నించాడు.

ప్యూను రాజుని పైనుండి క్రిందవరకూ చూసి, "అర్జెంటు పని పడి వెళ్ళుంటారు. రేపొస్తారేమో?" అన్నాడు.

మళ్ళీ ఆశ. కాకపోతే రేపటికి బదిలీ అయింది. వచ్చేస్తారా? రేపొస్తారా? అంటూ ప్యూనుని రెట్టించి అడిగాడు. ప్యూను అప్పటికి రాజుని వదిలించుకోడానికా అన్నట్లు "ఊ" అంటూ బుర్రూపాడు. రాజుకి ఆఫీసులో ఏం చేయాలో అర్థంకాలేదు. మెల్లగా కుంటుకుంటూ బైటకి వచ్చేసాడు. రేపటివరకూ ఏం చెయ్యాలి? ఎక్కడికి వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళడానికి జేబులో డబ్బులు కూడా లేవు. ఉన్న డబ్బులు మధ్యాహ్నం భోజనానికి కూడా పూర్తిగా సరిపోవు. మధ్యాహ్నం హోటల్లో టిఫిన్ చేస్తే అవికూడా అయిపోతాయి. ఇన్ని ఆలోచించి హోటలుకి ఎదురుగా ఉన్న రోడ్డు సైడు టీ బడ్డీదగ్గర, నాలుగు ఇడ్లీలు తిని, టీ తాగి రోడ్డు మీదకి వచ్చి ఎండ తీవ్రంగా ఉండడం వల్ల, బస్‌స్టాపులోకి వెళ్ళి కూర్చున్నాడు. నిన్నటి నుండి స్నానం ఏదీ లేకపోవడం వల్ల, వళ్ళంతా చెమట పోసి, చికాకుగా ఉంది. బట్టలు కంపుకొడుతున్నాయి.

ఏం చెయ్యడానికీ తోచక సాయంకాలం నాలుగు గంటలవరకూ ఆ బస్ స్టాప్‌లోనే గడిపాడు. ఎండ తగ్గాక రోడ్డుమీద కొంచెం దూరం నడిచి మళ్ళీ బస్‌స్టాపుకే వచ్చాడు. మధ్యాహ్నం భోజనం లేకపోడం వల్ల కడుపులో ఆకలి పెరిగిపోతోంది. దానికి నేను తోడు అన్నట్టు తలనొప్పి బయలుదేరింది. రాజు జేబులో చూసుకున్నాడు. జేబులో మిగిలిన డబ్బులకి రెండు ఇడ్లీలు, ఒక టీ మాత్రం వస్తాయి. ఏవేనా తింటేగానీ ఆకలి తీరేట్టులేదు. అనుకుని రాజు టీకొట్టు దగ్గరకి వెళ్ళి రెండు ఇడ్లీలు తిని, టీతాగాడు. దాంతో ఆకలి, తలనొప్పి శాంతించాయి.

అక్కడ నుండి ఎక్కడేనా తిరుగుదాం అనుకున్నాడు కాని తిన్నవి అరిగిపోతే, మళ్ళీ రాత్రి తినడానికి తన దగ్గర డబ్బులేదన్న సంగతి జ్ఞాపకం వచ్చి, వెళ్ళి బస్ స్టాపులో కూర్చున్నాడు. రాత్రి తొమ్మిదయేసరికి బస్‌స్టాపు ఖాళీ అయింది. అంతవరకూ ముణుచుకు కూర్చున్న రాజు, కాలుసాగదీసి, రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు.

రాత్రి పదయింది. కడుపులో మళ్ళీ ఆకలి బయలుదేరింది. కానీ చేసేదేం లేదు. రాత్రి పదకొండయేసరికి చిన్న మాగన్ను పడింది. ఆకలి వల్ల నిద్రకూడా సరిగా రావడం లేదు. పట్టీ పట్టని నిద్రచెడగొడుతూ మాటలు వినిపించాయి. ఎవరా అని పక్కకి తిరిగి చూసాడు. నిన్నటి బిచ్చగాళ్ళే బస్ స్టాపు సిమెంటు నేలని గోనెలతో శుభ్రం చేసుకుంటున్నారు. పరిస్థితి మరోలా ఉంటే రాజు అక్కడ నుండి లేచి వెళ్ళిపోయేవాడు. అలా పడుకోడం తన సంస్కృతి కాదు. బిచ్చగాళ్ళే అలా పడుకుంటారు. తను బిచ్చగాడు కాదు నిస్సహాయుడు. ఎందుకయాడు ఎవరు చేసారు తన నిస్సహాయత్వానికి కారణాలేమిటి? అన్న ఆలోచనలు అతనికి రాలేదు. రాత్రి తిండిలేక నీరసంగా ఉండి, లేవడానికి కూడా ఓపికలేక, అలాగే పడుకున్నాడు. నిద్రపట్టేసింది రాజుకి.

●●●

తెల్లవారగానే బిచ్చగాళ్ళు లేచి, బస్ స్టాపుకి ఎదురుగా ఉన్న కొళాయి క్రింద స్నానం చేసి ఎటో వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయాక రాజు లేచాడు. ఏం చెయ్యాలి? రెండురోజులుగా తిరగడం వలన, బస్‌స్టాపు దుమ్ములో పడుకోడం వలన వళ్ళంతా చీదరంగా ఉంది. కడుపులో ఏమీ పడకపోవడం వలన నీరసంగా ఉంది. ఆకలి తీరాలంటే డబ్బులుండాలి. కానీ స్నానం చెయ్యడానికి నయాపైస అక్కర్లేదన్న విషయాన్ని బిచ్చగాళ్ళు చెప్పారు. రాజు ఏదో తెగించిన వాడిలాగ, గబగబా మునిసిపాలిటీ కొళాయి దగ్గరకి వెళ్ళి

బట్టలు విప్పి స్నానం చేసి తడిలాగుమీదే, ఒళ్ళు తుడుచుకోకుండా మళ్ళీ ఆ బట్టలే తొడుక్కుని, కొళాయి నీళ్ళు నాలుగు దోసెళ్ళు తాగి, బస్ స్టాపుకి వచ్చి కూర్చున్నాడు.

నీళ్ళతో నిండిన కడుపు పది నిమిషాల్లో ఖాళీ అయిపోయింది. నీరసాన్ని, నిస్సహాయతని పదిగంటలవరకూ భరించి, ఆ లేండ్ ఎక్విజిషను ఆఫీసులోకి వెళ్ళాడు రాజు.

పదకొండుగంటలకి ఆఫీసరు వారం రోజుల వరకూ కేంపునుండి రాడని చెప్పాడు ప్యూను.

"అదేమిటి ఇవాళ ఆఫీసరుగారు వస్తారని చెప్పావు" అన్నాడు రాజు ఆశ్చర్యంగా.

"బావుందయ్యా ఆయనేమైనా నా పర్మిషను తీసుకుని కేంపుకెళ్ళాడా" అంటూ రాజుని విచిత్రంగా చూసాడు ప్యూను.

రాజుకి కోపం వచ్చింది. కానీ ఎవరిమీద చూపించడం, కోపం నిరాశగా మారి ఏడుపొచ్చింది. కానీ కష్టం మీద ఏడుపు ఆపుకుని ఆఫీసు నుండి బైటకి వచ్చి, మళ్ళీ బస్ స్టాపు నేలమీద చతికిలపడ్డాడు.

పన్నెండవుతున్న కొద్దీ బస్ స్టాపులో జనం పలచపడ్డారు. బస్‌స్టాపు ఖాళీ అవగానే విశ్రాంతిగా కాలు జాపుకుని, సిమెంటు గట్టుని ఆనుకుని తల సిమెంటు గట్టుకి ఆనించి కళ్ళు మూసాడు. రాత్రి ముష్టివాళ్ళతో పడుకున్నానన్న భావనతో సరిగా నిద్రపోని రాజు ఆదమరచి నోరు తెరిచి నిద్రపోయాడు.

రాజు పడుకున్న విధానం, మొహంలో నీరసం, రాజు పక్కన ఉన్న కర్రలు, కుంటితనం ఓ ప్రయాణికుడి మనసు కరిగించాయి. ఓ పావలా కాసుతీసి రాజు కాళ్ళ దగ్గర పడేసాడు.

ఠంగుమన్న చప్పుడుతో తెలివి వచ్చింది రాజుకి, కాళ్ళదగ్గర పడ్డ పావలాని, అది విసిరిన ప్రయాణికుడ్ని మార్చి మార్చి చూసాడు. కానీ పావలా తీసి ప్రయాణీకుడికి ఇచ్చేసి, నేను బిచ్చగాడిని కాదు అని చెప్పుకోలేకపోయాడు. రాజు కాళ్ళ దగ్గర పావలా చూసిన కొందరు ప్రయాణీకులు తమ దగ్గరున్న అయిదు, పదిపైసల నాణేల్ని వేసారు. సాయంకాలం బస్ స్టాపులో రద్దీ పెరిగింది. నిన్నటినుంచీ ఇక్కడే తిరుగుతున్న కుంటిరాజుని చూసిన కొందరు బిచ్చగాడే అన్న నిర్ధారణతో వీళ్ళంతా బస్టాపులు ఆక్రమిస్తే ఎలాగ అంటూ కూడా డబ్బులు వేసారు.

సాయంకాలం అవుతున్నకొద్దీ రాజు తన బిచ్చగాడ్ని కాదన్న విషయం మర్చిపోయాడు. కానీ దగ్గర పడ్డ డబ్బులు ఏరుకోడానికి లోపల అహం అడ్డొచ్చింది. కానీ వాటిని లెక్కపెట్టడం మొదలు పెట్టాడు.

రాత్రిరద్దీలో ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు, బస్ స్టాపు లోంచి బయటికి పోయి అడుక్కోమని గసిరారు. దానికి రాజు బాధపడ్డాడు. కానీ తన చుట్టూ పడ్డ చిల్లరని వదిలిపోలేదు. వాటిని తీసుకోనూ లేదు. రాత్రి తొమ్మిదిగంటలకి బస్ స్టాపు నిర్మానుష్యం అయింది. మసక చీకట్లో దూరంగా ఉన్న మునిసిపల్ వారి ఎలక్ట్రిక్ దీపం వెలుగులో రాజుకి కిందపడ్డ చిల్లర చమక్ చమక్ మంటూ కనపడింది. వాటిని చేతితో దగ్గరగా తీసుకుని జేబులో వేసుకున్నాడు. చీకట్లో నాణేలు మూలలకి దొర్లిపోయాయేమో? అని చేత్తో తడివి చూసాడు. ఇంకేం నాణేలూ బస్ స్టాపులో మిగలలేదని నిర్ధారణ చేసుకుని, బస్‌స్టాపు నుండి మునిసిపాలిటీ దీపం దగ్గరకి వెళ్ళి, చిల్లరంతా లెక్కబెట్టాడు. మొత్తం ఆరున్నర రూపాయలు తేలింది.

ఆ రోజు రాత్రి రోడ్డు సైడువున్న టీకొట్టు కెళ్ళి టిఫిను తిని టీతాగాడు. చిల్లరిచ్చిన రాజుని టీకొట్టువాడు అదోలా చూసాడు. కడుపునిండడంతో మళ్ళీ బస్‌స్టాపుకి వచ్చి, పాత సంస్కారాలు ఆలోచన్లు అన్నిటినుండి విముక్తి పొంది తను బిచ్చగాళ్ళతో పడుకుంటున్నానన్న విషయం మర్చిపోయి హాయిగా నిద్రపోయాడు.

అయితే రాజు బిచ్చగాడా? కాసులకోసం బిచ్చగాడు అయాడు దానికి కారణం?

●●●

అలా పాత సంస్కారం నుండి విముక్తి చెందిన రాజు కొత్త జీవితం, రెండోరోజు తనతో పడుకుంటున్న ముష్టివాళ్ళతో పరిచయం చేసుకుని, కష్టసుఖాలు, లాభనష్టాలు చెప్పుకోడంతో మరో మెట్టు ఎక్కింది.

రోజూ ఏడుగంటలకి స్నానాదులు ముగించి, వచ్చేపోయే ప్రయాణీకుల్ని ఆశగా చూడడం, అప్పుడప్పుడు చెయ్యిచాచి అడగడం, జాలిపడని వాళ్ళని కుంటికాలు చూపించి ప్రాధేయపడడం, వరకూ అభివృద్ధి చెందింది. దానితో రాజు ఆదాయం పెరిగింది లేండు ఎక్విజిషను ఆఫీసరు తెరమరుగుకి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళ తర్వాత ఈ కుంటిబిచ్చగాడు బష్ షాపు ఉపయోగించుకునే ప్రజలకి పాతపడిపోయాడు. రాజుకి తన ఆదాయం మీద తృప్తి కలగలేదు. బస్ షాపులో రద్దీగా ఉండని సమయాల్లో రోడ్డు మీద ఒకటి రెండు కిలోమీటర్లు కుంటుకుంటూ వెళ్ళి అడుక్కుంటున్నాడు. చెయ్యిచాచడం అంత తేలిక కాదు. చెయ్యి చాచిన తర్వాత ఎవడు ఎంత వేస్తున్నాడు అన్న విచక్షణ లేదు. కానీ ఈ వృత్తిలో స్థిర పడ్డాక ఎందుకీ నీచం. తను చెయ్యి చాచితే పది పైసలు పావలానా ఇంత చిన్న చూపా ఈ రోజుల్లో పావలాకి పదిపైసల్కి విలువేమిటి? ప్రజలు రూపాయికి తక్కువగా బిచ్చం వేస్తున్నందుకు చికాకుపడుతున్నాడు.

అలా అడుక్కోడానికెళ్ళిన రాజు ఓ రాత్రి పదిగంటలకి వెనక్కి బస్ షాపుకి వస్తూ, బస్ షాపుకి అరకిలోమీటరు దూరంలో ఉన్న ఇంటి దగ్గర ఆగాడు. ఏదో గొడవ అవుతోంది. ఇంటికోసం ఇల్లు కాళీ చేయించే విషయంలో దెబ్బలాడుకుంటున్నారు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. బస్‌షాపులో పడుకునే చోటు, తను ఆలస్యంగా వెళితే ఆ చోటుని ఎవరో ఒకరు ఆక్రమించేస్తారు. రాత్రి పడుకోడానికి చోటుండదు. కుంటుకుంటూ మరో బస్ షాపుకి వెళ్ళాలి అక్కడా చోటుంటుదని నమ్మకం లేదు. ఈ విశాఖపట్నంలో ఇళ్ళల్లో ఎంత మంది నివసిస్తున్నారో, రోడ్డి పేవు మెంట్ల మీద, బస్ షాపుల్లో అంతమందీ నివసిస్తున్నారు. కాబట్టి చోటు దొరుకుతుందనుకోడం కల్ల.

ఆ ఆలోచన రాగా షాప్‌కి గబగబా కుంటడం మొదలు పెట్టాడు ముష్టిరాజు.

రాజులో వచ్చిన మార్పు చూస్తూ ఉంటే ప్రస్తుత పరిస్థితిలో ఏ వ్యక్తి తన సంస్కారాన్ని వదులుకుని మరో అవతారాన్ని ఎత్తుతున్నాడు? ఏ జాతి తన ఉనికిని పోగొట్టుకుంటోంది. ఏ జాతి తన విలువల్ని సంస్కారాన్ని మార్చేసుకుంటోందో వివరించకుండానే అర్థం అయిపోతోంది.

వీటన్నింటికీ మూలం మనీ అన్నది నిజం ఈ కాసులు మిగిలిపోతాయని ఇవే మన గొప్పతనానికి డాబూ దర్పం ఇస్తాయనుకోడం తెలిసీ చేస్తున్న మరో తప్పు.

ఈ తప్పుల్ని తమ విజన్లగా చెప్పుకునే నాయకుల్ని రాజకీయ మిండగాళ్ళని చూస్తే ఇన్ డెమొక్రసి వియ్ హావ్ నొ ఛాయిస్ అనిపిస్తుంది. మనకి ఛాయిస్ విముక్తి ఎప్పుడు?